


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

17.08.2026

సోమవారం | రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 48

పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## 'దిమాగీ నక్సల్స్' లిస్ట్ ఇదే

- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సంచలన కామెంట్
- "గర్వంగా ఉంది" అన్న కాంగ్రెస్ నేత చిదంబరం



న్యూఢిల్లీ, ఆగస్ట్ 16,
అనంత జనశక్తి న్యూస్

ప్రధాని నరేంద్రమోడీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎర్రకోట పై నుంచి ''దిమాగీ నక్సల్స్'' అనే వ్యాఖ్యలు చేయడం ప్రతిపక్షాల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ''దిమాగీ నక్సల్స్'' అంటే ఎవరో చెబుతూ సోషల్ మీడియా పోస్ట్ పెట్టారు. దీనికి కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం వ్యంగ్యంగా స్పందిస్తూ.. తాను 'దిమాగీ నక్సల్స్''గా ఉండటానికి గర్విస్తున్నారని అన్నారు. 2లో..

## నేను మాత్రం సక్సెస్ అవుతా

- నాకూ షర్మిలకు పోలికేంటి!
- టీఆర్ఎస్ అధినేత్రి కవిత
- వైఎస్ షర్మిల నేపథ్యం, తన నేపథ్యం వేర్వేరు
- నేను ఉద్యమంలో నుంచి వచ్చానని వెల్లడి

2లో..





హైదరాబాద్, ఆగస్ట్ 16,
అనంత జనశక్తి న్యూస్

తెలుగు రాజకీయాలలో పోలిక అనేది కామన్ పాయింట్.. అది ప్రభుత్వాల పనితీరు అయినా, రాష్ట్రాలకు వచ్చే పెట్టుబడులు అయినా.. ఇంకో విషయమైనా.. రెండు రాష్ట్రాల మధ్యన సారూప్యత, పోలికలు తీయటం సర్వసాధారణంగా మారిందనేది కాదనలేని వాస్తవం. ఈ క్రమంలోనే కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని స్థాపించినప్పుడు కూడా ఇదే తరహాలో పోలికలు తీశారు. కల్వకుంట్ల కవితకు, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలకు మధ్య పోలికలు తీస్తూ అనేక విశ్లేషణలు, కథనాలు వెలువడ్డాయి.

# పరకాలకు సీఎం వరాల జల్లు

- బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- సెప్టెంబర్‌లో అసెంబ్లీ.. చర్చకు సవాల్
- రూ.8.11 లక్షల కోట్ల అప్పులపై ఫైర్
- రైతులు, మహిళలకు ప్రాధాన్యమన్న సీఎం
- రూ.200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్
- రూ.65 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డు
- రూ.32 కోట్లతో మహిళా డెయిరీ ప్లాంట్
- 100 పడకల ఆసుపత్రి ప్రారంభం

2లో..



వరంగల్, ఆగస్ట్ 16,
అనంత జనశక్తి న్యూస్

వరంగల్ జిల్లా పరకాలలో నిర్వహించిన "ప్రజా పాలన ప్రగతి బాట" బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఓరుగల్లు పోరాట స్ఫూర్తిని కొనియాడుతూనే, గత బీఆర్ఎస్ పాలనపై, కేసీఆర్ కుటుంబంపై విమర్శలు గుప్పించారు. సెప్టెంబర్‌లో శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేయబోతున్నామని, అభివృద్ధి , అప్పులపై చర్చకు రావాలని కేటీఆర్, హరీష్ రావులకు సవాల్ విసిరారు.

**వరంగల్ చైతన్యానికి ప్రతీక.. గోతి తీసి పాతిపెట్టిన చరిత్ర**

ప్రజా సమస్యలపై నిలదీసే నైజం, పోరాడే శక్తి ఓరుగల్లు గడ్డకు సొంతమని, జయశంకర్, దాశరథి వంటి మహనీయులు నడయాడిన ఈ ప్రాంతం ఎల్లప్పుడూ అణచివేతకు వ్యతిరేకంగా చైతన్యాన్ని ప్రదర్శించిందని సీఎం తెలిపారు. తమను తాము దేవుళ్లుగా భావించి ప్రజలపై ఆధిపత్యం చలాయించాలని చూసిన వారిని, ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడి అధికారమే శాశ్వతమని అనుకున్న వారిని ఇక్కడి ప్రజలు ఓడించి గోతి తీసి పాతిపెట్టారని పేర్కొన్నారు. పాలకుర్తిలో మాజీ మంత్రిని ఓడించి తమ అభ్యర్థి యశస్విని బద్దలు కొట్టిన ఘనత ఈ ప్రాంతానిదేనని ప్రశంసించారు.

**అసెంబ్లీ వేదికగా చర్చకు సిద్ధం.. రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారం**


రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను వివరిస్తూ, గత ప్రభుత్వం రూ.8.11 లక్షల కోట్ల అప్పులను వారసత్వంగా ఇచ్చిందని, వీటికి మిత్తి (వడ్డీ) కిందనే ప్రతి ఏటా రూ.75 వేల కోట్లు చెల్లిస్తున్నామని వివరించారు. సెప్టెంబర్ నెలలో తెలంగాణ శాసనసభ సమావేశాలు నిర్వహిస్తామని, ఆ సమావేశాలకు "బావా బామ్మర్దులు" (కేటీఆర్, హరీష్ రావు) చర్చకు రావాలని... కేసీఆర్ ను తీసుకురావాలని సవాల్ విసిరారు. తెలంగాణలో ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

**రైతాంగ సంక్షేమం , మహిళా సాధికారత**

కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాన్ని ప్రస్తావిస్తూ, "కాళేశ్వరం కూలేశ్వరం అయినా" ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని ప్రాజెక్టులను నింపి రైతులు అత్యధికంగా వరిధాన్యం పండించేలా చేశామని సీఎం చెప్పారు.

## ప్రజలను అప్రమత్తం వెంటనే చేయండి

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏనుగుల సంచారంపై కామెంట్
- రాత్రివేళ గస్తీని మరింత పెంచాలి
- కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు..
- డ్రోన్లను వినియోగించాలి
- అధికారులను ఆదేశించిన పవన్ 2లో..





చిత్తూరు, ఆగస్ట్ 16, అనంతజనశక్తి న్యూస్

చిత్తూరు జిల్లాల్లోని చంద్రగిరి సమీప ప్రాంతాల్లో ఏనుగుల సంచారం నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు డ్రోన్లను వినియోగించాలని, అటవీ సమీప గ్రామాల్లో రాత్రివేళ గస్తీని మరింత పెంచాలని అధికారులకు స్పష్టం చేశారు.

### నలుగురు యువకులు గల్లంతు!

## పెళ్లి సందడి కాస్త విషాదం

- కాలువలోకి దూసుకెళ్లిన కారు
- పశ్చిమ గోదావరిలో ఘటన





ఇరగవరం, ఆగస్ట్ 16,
అనంతజనశక్తి న్యూస్

పశ్చిమ గోదావరి జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఇరగవరం మండలం ఐతంపూడి లాకుల సమీపంలో ఓ కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు గల్లంతయ్యారు. మరో యువకుడు సురక్షితంగా బయటపడ్డాడు. 2లో..

## బండ్ల గణేష్ కుమార్తె పెళ్లికి చంద్రబాబు దంపతులు

2లో..



## జగన్ అండ్ కో అసెంబ్లీలో మాట్లాడాలి

2లో..



- పారిపోకూడదు.. మాధవ్ సెటైర్లు
- మెగా డీఎస్సీపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం
- జగన్ రెడ్డి రావాలి

## కేసీఆర్ పాలనకు మీ పిల్లలే రిపోర్టు కార్డు ఇస్తున్నారు

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- బీఆర్ఎస్ పదేండ్లు పాలించింది
- ఇప్పుడేమో మంచి కాలేజీలు లేవంటున్నది
- పదేండ్లు అధికారంలో ఉండి ఏం చేశారు?

2లో..

హైదరాబాద్, ఆగస్ట్ 16, అనంత జనశక్తి న్యూస్

బీఆర్ఎస్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్లు తెలంగాణను పాలించిందని... కానీ ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత, అకస్మాత్తుగా 'భారత్‌లో మంచి కాలేజీలు లేవు' అని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు? అని ప్రశ్నించారు. మంచి పాఠశాలలు, కాలేజీలు ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారు? అని నిలదీశారు.

## దాతలు ముందుకు రావాలి

- ప్రభుత్వ హాస్టళ్ల డెవలప్‌మెంట్‌కు..
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

2లో..



## రైతుకు మేలు జరిగితే సాక్షికి ఎందుకింత కడుపుమంట?

- పంటల బీమాపై తప్పుడు ప్రచారంతో రైతులను తప్పదోవ పట్టించొద్దు
- ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో ప్రతి రైతుకూ బీమా రక్షణే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



2లో..

అమరావతి | ఆగస్టు 16,
అనంత జనశక్తి ప్రతినిధి

రైతులకు మేలు చేయాలనే సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున పంటల బీమా నమోదు చేపడితే దానిని కూడా వక్రీకరిస్తూ సాక్షి పత్రిక తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. అవాస్తవాలతో రైతుల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుకు మేలు జరిగితే ఓర్వలేని ధోరణితో వార్తలు రాయడం మానుకోవాలని హితవు పలికారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, అనిశ్చిత వర్షపాతం ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదనే లక్ష్యంతోనే ప్రభుత్వం పంటల బీమాపై ప్రత్యేక దృష్టి పెట్టిందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి రైతును ప్రత్యక్షంగా సంప్రదించడంతో పాటు రైతు సేవా కేంద్రం, క్లస్టర్, రైతువారీగా అర్హుల వివరాలను మ్యాపింగ్ చేశామని తెలిపారు.

# దాతలు ముందుకు రావాలి

**అమరావతి, ఆగస్ట్ 16, అనంత జనశక్తి న్యూస్**

ప్రభుత్వ హాస్టళ్ల డెవలప్‌మెంట్‌కు దాతలు ముందుకు రావాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లాలో పౌర గ్రంథాలయ శాఖ నూతన భవన నిర్మాణ అవగాహన ఒప్పంద కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్, జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడారు. 1915లో బ్రిటీష్‌వారు కమ్యూనిటీ హాల్‌ను స్టేట్ లైబ్రరీగా మార్చారని ప్రస్తావించారు. లక్షలాది మందికి ఈ లైబ్రరీ సేవలు అందిస్తుందని పెమ్మసాని వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం ఈ భవనం కూలే పరిస్థితికి వచ్చిందని తెలిపారు. అందుకే ఈ బిల్డింగ్ నిర్మించేందుకు చల్లా రాజేంద్రప్రసాద్ ముందుకు వచ్చారని అన్నారు. ఆయన వరల్డ్ బెస్ట్ కాఫీ లేబుల్స్‌ను డెవలప్ చేసి ప్రజలకు కాంటినెంటల్ కాఫీని అందిస్తున్నారని వెల్లడించారు. పేద వారు కూర్చొని చదువుకునే విధంగా దాదాపు రూ.20కోట్ల వరకు ఖర్చవుతుందని తెలిపారు. అందుకే రాజేంద్రప్రసాద్‌తో స్టేట్ లైబ్రరీ బిల్డింగ్ నిర్మాణానికి ఎంవోయూ చేయిస్తున్నామని చెప్పారు. ఈ జీ ప్లస్ టూ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ ప్రారంభానికి మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# ‘దిమాగీ నక్సల్స్’ లిస్ట్ ఇదే

(మొదటి పేజీ తరువాయి)

రిజిజు ప్రకారం, “దిమాగీ నక్సల్స్” అంటే.. మావోయిస్టులకు మద్దతు ఇస్తూ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించేవారు, వేర్పాటువాదులకు మద్దతు ఇచ్చేవారు, ఆర్టికల్ 370కు మద్దతు ఇచ్చేవారు, దేశ ఈశాన్య ప్రాంతాన్ని భారతదేశం నుంచి వేరు చేయడానికి “చికెన్ నెక్”ను తెంచాలని కోరుకునేవారు అని అన్నారు. ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అనే పదంపై సీపీఎం, కాక్రోచ్ జనతా పార్టీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.
శనివారం ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశిస్తూ ప్రసంగించిన ప్రధాని నరేంద్రమోడీ.. అడవుల్లో ఆయుధాలు పట్టుకుని పోరాడిన నక్సలైట్లను దాదాపుగా అంతం చేశామని చెప్పారు. అయితే మావోయిస్టు భావజాలంతో ఉన్న “దిమాగీ నక్సల్స్”(నక్సల్ భావజాలం) ఇంకా అవకాశాల కోసం చూస్తున్నారని, హింస, అశాంతికి దారితీసే ప్రయత్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలంటే అలాంటి వారిని గుర్తించి ఏకాకులు చేయాలని మోడీ అన్నారు.

# పరకాలకు సీఎం వరాల జల్లు

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నరేళ్లలో రైతుల కోసం లక్ష కోట్లు ఖర్చు చేశామని, సన్న ధాన్యానికి బోనస్ అందించామని తెలిపారు. రైతుల కోసం రూ.90 వేల కోట్లతో ధాన్యం కొనుగోళ్లు చేపట్టడంతో పాటు రైతు భరోసా, రుణమాఫీని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ, తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలను (సీతక్క, కొండా సురేఖ) మంత్రులను చేశామని, ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలను గౌరవించుకుంటున్నామని చెప్పారు.

**నిరుద్యోగులకు పిలుపు.. ఆస్తి , కుటుంబ వివాదాలపై వ్యాఖ్యలు**

నిరుద్యోగులను రెచ్చగొట్టే రాజకీయనాయకుల మాయమాటలను నమ్మవద్దని సీఎం కోరారు. తమ ప్రభుత్వం ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేసిందని, పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్‌తో పాటు వయోపరిమితిని సడలించామని తెలిపారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తామని, నిరుద్యోగులు పరీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో కేటీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని సొంత సోదరినే ఇంటి నుంచి గెంటేసిన చరిత్ర వారిదని, తండ్రి ధృతరాష్ట్రుడిలా మౌనంగా ఉండిపోయారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో రక్తం ఇచ్చిన కార్యకర్తల రక్తాన్ని విక్రయించుకున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**ప్రజా పాలన వర్సెస్ కుటుంబ పాలన**

తమ పాలనకు, గత పాలకుల కుటుంబ స్వార్థానికి ఉన్న వ్యత్యాసాన్ని సీఎం వివరించారు. కేసీఆర్ హయాంలో పదవులన్నీ తన కొడుకు, అల్లుడు, బిడ్డ, చుట్టాలకే దక్కాయని.. కానీ ప్రజా ప్రభుత్వంలో సామాన్య కార్యకర్తలకు, ఉద్యమకారులకు అవకాశాలు లభించాయని చెప్పారు. కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, కావ్య, యశస్విని, వేం నరేందర్ రెడ్డి, కోదండరాం, మహేష్ గౌడ్ వంటి వారికి పదవులు ఇవ్వడం ప్రజా ప్రభుత్వానికి నిదర్శనమన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు ఎంతమంది కేసీఆర్‌లు వచ్చినా తమను ఏమీ చేయలేరని, 2029లోనూ రెట్టింపు మెజారిటీతో మళ్లీ ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు.

# నేను మాత్రం సక్సెస్ అవుతా

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు కూడా బలమైన రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాల నుంచి రావడం.. కుటుంబాలలో వివాదాల కారణంగా సొంత పార్టీలు పెట్టుకోవటంతో షర్మిల, కవిత మధ్య కంపారిజన్ తీయడం మొదలైంది.
వైఎస్ షర్మిల తెలంగాణలో వైఎస్‌ఆర్టీపీ పేరుతో పార్టీని స్థాపించడం, పాదయాత్ర చేపట్టడం తెలిసిందే. షర్మిల పాదయాత్ర, ఎమ్మెల్యేలపై షర్మిల ఆరోపణలతో అప్పట్లో జరిగిన ఘటనలు కూడా తెలిసిన సంగతే. అయితే ఆ తర్వాత జరిగిన వివిధ రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైఎస్ షర్మిల తన పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు. ఆ తర్వాత ఏపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించి.. ప్రస్తుతం ఆ పదవిలో కొనసాగుతున్నారు. అయితే షర్మిల మాదిరిగానే కవిత కూడా కొత్త పార్టీని స్థాపించడంతో.. కవిత మరో షర్మిలలాగా మారతారనే అభిప్రాయాలు, విశ్లేషణలు వ్యక్తమయ్యాయి. అయితే ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఈ పోలికలకు ఫుల్ స్టాప్ పెట్టారు కవిత.
తనకు, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలకు మధ్య పోలిక తేవడాన్ని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత తోసిపుచ్చారు. తనకు, షర్మిలకు అసలు పోలికేలేదని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. వైఎస్ షర్మిల నేపథ్యం, తన నేపథ్యం వేర్వేరని అభిప్రాయపడ్డారు. తాను ఉద్యమంలో నుంచి వచ్చానని.. కేసీఆర్ ఎలా అయితే పార్టీ స్థాపించి, విజయవంతమై, తెలంగాణలో చరిత్ర సృష్టించారో.. తాను కూడా అదే తరహాలో తెలంగాణలో కొత్త చరిత్ర రాస్తానన్నారు కవిత. ఫెయిల్యూర్స్ ఉదాహరణ తీసుకుని ముందుకెళ్తే నిరుత్సాహపడతారని.. తాను కేసీఆర్, జగన్ లాగా విజయవంతమవుతానని కవిత ధీమా వ్యక్తం చేశారు. జగన్ కూడా వాళ్ల తండ్రి ఉన్నప్పుడు ఎంపీ అయ్యారని.. తాను కూడా ఎంపీ అయిన విషయాన్ని గుర్తు చేశారు. ఫెయిల్యూర్స్ కాకుండా విజయవంతమైనవారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్తే తప్పేముందని కవిత చెప్పుకొచ్చారు.

# బండ్ల గణేష్ కుమార్తె పెళ్లికి చంద్రబాబు దంపతులు



**- ఇద్దరి చేతుల మీదుగా మాంగళ్యం అందుకున్న వరుడు**

**హైదరాబాద్, ఆగస్ట్ 16, అనంతజనశక్తి న్యూస్**

ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ కుమార్తె వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. బండ్ల గణేష్ కుమార్తె జనని, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో అంగరంగ వైభవంగా జరిగిన వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటుగా.. మాజీ మంత్రి కేటీఆర్, ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత, స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, సినీ నటులు చిరంజీవి, నాగార్జున హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇక బండ్ల గణేష్ కుమార్తె వివాహానికి సంబంధించిన పలు వీడియోలు, ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరోవైపు బండ్ల గణేష్‌కు, చంద్రబాబు కుటుంబానికి మధ్య మంచి సంబంధాలు ఉన్న సంగతి తెలిసిందే. దీంతో సీఎం చంద్రబాబు తన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి వివాహానికి హాజరయ్యారు. నూతన వధూవరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వరుడు సూర్యతేజ చంద్రబాబు దంపతుల చేతుల మీదుగా తాళి అందుకుని మాంగళ్యధారణ చేయడం విశేషం. ఇక తన కుమార్తె పెళ్లికి చంద్రబాబు సతీసమేతంగా రావడంతో బండ్ల గణేష్ ఎమోషనల్ అయ్యారు. కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో పక్కనే ఉన్న నటుడు బ్రహ్మాజీ ఆయనను ఊరడిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బండ్ల గణేష్ సినీ, రాజకీయాలకు చెందిన వ్యక్తి కావటంతో ఆయా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. చంద్రబాబుపై అభిమానంతో బండ్ల గణేష్ తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికలోనూ ఆయన పేరు వేయించిన సంగతి తెలిసిందే. ఆహ్వాన పత్రిక పైభాగంలో శ్రీమతి నారా భువనేశ్వరి, శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆశీర్వాదాలతో అని రాయించడం అప్పట్లో వైరల్ అయ్యింది. అంతేకాదు.. 2023లో చంద్రబాబు నాయుడు జైలులో ఉన్న సమయంలో, ఆయన జైలు నుంచి విడుదల కావాలని, మళ్లీ సీఎం కావాలని బండ్ల గణేష్ మొక్కుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ మొక్కును చెల్లించేందుకు కాలినడకన షాద్ నగర్ నుంచి తిరుమల వెళ్లి, శ్రీవారిని దర్శించుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు చంద్రబాబు దంపతుల చేతుల మీదుగా కుమార్తె వివాహం జరిపించి మరోసారి చంద్రబాబుపై తన అభిమానం నిరూపించుకున్నారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# రైతుకు మేలు జరిగితే సాక్షికి ఎందుకింత కడుపుమంట?



(మొదటి పేజీ తరువాయి)

బీమా పరిధిలోకి రాని అర్హులైన రైతులను గుర్తించి జూలై 29 నుంచి 31 వరకు ప్రత్యేక పంటల బీమా నమోదు కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. ఇది సిబ్బందిపై ఒత్తిడి కాదని, అర్హులైన ప్రతి రైతుకూ బీమా రక్షణ కల్పించాలనే బాధ్యతాయుతమైన చర్య అని స్పష్టం చేశారు.పంటల బీమా నమోదు పూర్తిగా రైతుల సమ్మతి, వారి ఇష్టప్రకారమే జరిగిందని, ఎవరినీ బలవంతంగా నమోదు చేయలేదని మంత్రి తేల్చిచెప్పారు. బీమా గడువు ముగిసిన తర్వాత నమోదు చేసుకునే అవకాశం ఉండదని, అందుకే పంట సాగుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లోని రైతులకు ముందుగానే అవగాహన కల్పించి బీమా తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. బీమా చేసిన మొత్తంలో రైతు చెల్లించాల్సిన ప్రీమియం కేవలం 0 నుంచి 2 శాతం మాత్రమేనని, మిగిలిన ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయని అచ్చెన్నాయుడు వివరించారు. కొన్ని జిల్లాల్లో ఎకరాకు రైతు చెల్లించాల్సిన ప్రీమియం చూస్తేనే ప్రభుత్వం రైతులపై ఎంత తక్కువ భారం పెడుతోందో అర్థమవుతుందన్నారు. వరి, కోనసీమ జిల్లాలో ₹76, సజ్జ, కర్నూలు జిల్లాలో ₹32, మినుము, కడప జిల్లాలో ₹38, వేరుశనగ, నెల్లూరు జిల్లాలో ₹280, జొన్న, కడప/కర్నూలు జిల్లాల్లో ₹35, మొక్కజొన్న, కర్నూలు/శ్రీకాకుళం జిల్లాల్లో ₹66, కంది, కడప జిల్లాలో ₹36, ఉల్లి, కడప/కర్నూలు జిల్లాల్లో ₹90, మిరప, కర్నూలు/పల్నాడు జిల్లాల్లో ₹360 మాత్రమే రైతు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. క్లస్టర్, జిల్లా, పంట, బీమా కంపెనీని బట్టి ప్రీమియంలో స్వల్ప వ్యత్యాసం ఉండవచ్చని పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రమాదం ఇప్పటికే స్పష్టంగా ఉండటంతో గడువుల పొడిగింపునకు బీమా కంపెనీలు తొలుత సుముఖత చూపకపోయినా, ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం, బీమా సంస్థలతో మాట్లాడి రైతుల ప్రయోజనాల కోసం గడువులను పొడిగించేలా కృషి చేశారని తెలిపారు. వాతావరణ ఆధారిత RWBCIS గడువును జూలై 15 నుంచి జూలై 31 వరకు, దిగుబడి ఆధారిత PMFBY గడువును జూలై 31 నుంచి ఆగస్టు 15 వరకు పొడిగించామని చెప్పారు. అంతేకాకుండా PMFBY నమోదును ఆగస్టు 31 వరకు మరింత పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించామని, నమోదు వివరాలను పూర్తిచేసేందుకు బ్యాంకులకు అదనంగా 15 రోజుల సమయం ఇచ్చినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యల ఫలితంగానే ఖరీఫ్-2026లో పంటల బీమా నమోదు రికార్డు స్థాయికి చేరిందని మంత్రి తెలిపారు. ఖరీఫ్-2025లో 19.50 లక్షలుగా ఉన్న నమోదు దరఖాస్తులు ఖరీఫ్-2026లో 35.17 లక్షలకు పెరిగాయని, ఇది సుమారు 80 శాతం పెరుగుదల అని చెప్పారు. ముఖ్యంగా రుణాలు తీసుకోని రైతుల నమోదు 2.00 లక్షల నుంచి ఏకంగా 20.35 లక్షలకు పెరిగిందన్నారు. బీమా విస్తీర్ణం 7.83 లక్షల హెక్టార్ల నుంచి 15.17 లక్షల హెక్టార్లకు, అంటే సుమారు 94 శాతం పెరిగిందని వెల్లడించారు. మొత్తం ₹13,983 కోట్ల బీమా మొత్తం నమోదైందని, బీమా విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో 5వ స్థానంలో నిలిచిందని తెలిపారు.రైతులకు పరిహారం అందడం లేదంటూ ఇప్పుడు విమర్శలు చేస్తున్న వారు గత ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన సుమారు ₹1,990 కోట్ల ప్రీమియం బకాయిలపై ముందుగా సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ బకాయిల కారణంగానే రైతులకు రావాల్సిన బీమా పరిహారం నిలిచిపోయిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా దశలవారీగా చెల్లించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. అదే విధంగా ఖరీఫ్-2025కు సంబంధించిన ప్రభుత్వ ప్రీమియాన్ని చెల్లించడంతో రైతుల ఖాతాల్లో బీమా పరిహారం జమయ్యే ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించారు. ఎల్‌నినో నేపథ్యంలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదు. అత్యంత తక్కువ ప్రీమియంతో గరిష్ఠ బీమా రక్షణ కల్పించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. రైతులకు మేలు జరుగుతుంటే అభినందించాల్సింది పోయి వాస్తవాలను వక్రీకరించి అపోహలు సృష్టించడం రైతు వ్యతిరేక ధోరణి. సాక్షి ఎన్ని తప్పుడు కథనాలు రాసినా గణాంకాలు, వాస్తవాలే కూటమి ప్రభుత్వ రైతు సంక్షేమ నిబద్ధతకు నిదర్శనం అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# కేసీఆర్ పాలనకు మీ పిల్లలే రిపోర్టు కార్డు ఇస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)



ఈ మేరకు బండి సంజయ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. కేసీఆర్ హయాంలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఎందుకు వచ్చింది? అని ప్రశ్నల వర్షం కురిపించారు. సరిపడా ఉపాధ్యాయులను ఎందుకు నియమించలేదు? అని నిలదీశారు.యూనివర్సిటీల్లో ఖాళీ పోస్టులు ఎందుకు పేరుకుపోయేలా చేశారు? అని అడిగారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని పేపర్ లీక్‌లు జరిగాయి? అని ప్రశ్నించారు.
మీ సొంత పిల్లలే ఇప్పుడు సమస్యలను ఎత్తిచూపుతున్నారు..
కాలేజీలకు నిధులు ఎందుకు ఇవ్వలేదు?, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో ఎందుకు చెల్లించలేకపోయారు? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ‘అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమాల్లో పాల్గొన్న యూనివర్సిటీ విద్యార్థులకు కనీస గౌరవం అయినా ఇచ్చారా?. బీఆర్ఎస్ పాలనకు ఇప్పుడు కేసీఆర్ కుటుంబం నుంచే రిపోర్ట్ కార్డు వస్తోంది. మొదట ఆయన మనవడు పాఠశాలలు బాగోలేవని చెబుతున్నాడు. ఇప్పుడు ఆయన మనవరాలు కాలేజీలు కూడా బాగోలేవని చెబుతోంది. పదేళ్లు అధికారంలో ఉండి, మీరు పరిష్కరించలేకపోయిన సమస్యలను మీ సొంత పిల్లలే ఇప్పుడు ఎత్తిచూపుతున్నారు. మీ రాజకీయ ప్రత్యర్థుల పిల్లలు కాలేజీల్లో ఏం చేస్తున్నారో గమనించడం, మా ఫోన్లను ట్యాప్ చేయడంపై దృష్టి పెట్టడం బదులు, మీ సొంత పిల్లలు చెబుతున్న విషయాలను మీరు వినాల్సింది. ఇక మరో అద్భుతమైన మాట: భారత్ కంటే శ్రీలంక గొప్పదట!. లంకను చూసి భారత్ కంటే గొప్పదని చెప్పేది రావణాసురుడే. రామభక్తులు ఎప్పటికీ తమ మాతృభూమి గురించి ఇంత అవమానకరంగా మాట్లాడరు’ అని బండి సంజయ్ అన్నారు.
నాకు ఎల్లప్పుడూ నేషనే ఫస్ట్..
‘భారత్‌లో అధికారాన్ని కోరుకుంటారని, ఇక్కడి ప్రజా ధనంపై నియంత్రణ కావాలని కోరుకుంటారు. కానీ దేశాన్ని ప్రశంసించే విషయానికి వచ్చేసరికి, ఇతర దేశాలన్నీ గొప్పగా కనిపిస్తాయి. ఒకవైపు కాంగ్రెస్ వందేమాతరం పాడటం ఆపాలని కోరుతోంది. మన ఇంజినీర్లను ‘క్రిమినల్ వేస్ట్’ అంటూ అవమానిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ భారత్‌లో మంచి కాలేజీలు లేవని, ఇతర దేశాలు భారత్ కంటే మెరుగ్గా ఉన్నాయని చెబుతోంది. అలాంటి వాళ్లు నేను నా చెమటను త్రివర్ణ కండువాతో తుడుచుకున్నానని నా దేశభక్తిని ప్రశ్నిస్తున్నారు!. నా చివరి శ్వాస వరకు కాషాయ జెండాను, త్రివర్ణ పతాకాన్ని గర్వంగా ధరిస్తాను. ఈ దేశం నా చెమటను చూసింది. భారత్‌కు ఎప్పుడైనా అవసరమైతే నా రక్తాన్ని కూడా ఇస్తాను. మీరు నన్ను వెయ్యిసార్లు ప్రశ్నించినా, ‘భారత్ మాతా కీ జై’ అంటా. మీరు ఎప్పటికీ నన్ను అర్థం చేసుకోలేరు. మీకు దేశభక్తి ఒక చర్చ కావచ్చు. నాకు మాత్రం అది జీవితాంతం నమ్మిన సిద్ధాంతం. నాకు ఎల్లప్పుడూ నేషనే ఫస్ట్’ అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# ప్రజలను అప్రమత్తం వెంటనే చేయండి



(మొదటి పేజీ తరువాయి)

ఏనుగులు సంచరించే ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని పవన్ కల్యాణ్ సూచించారు. ఇందుకోసం రెవెన్యూ, పోలీసు, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఏనుగుల కదలికలు కనిపించిన వెంటనే సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో హనుమాన్ బృందాలను మోహరించి ఏనుగుల కదలికలను పర్యవేక్షించాలని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశాలు ఇచ్చారు. ఏనుగులను రెచ్చగొట్టకుండా, వాటికి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.
చిత్తూరు జిల్లాలో ఏనుగుల బీభత్సం
చిత్తూరు జిల్లాలోని పలమనేరు మండలం టీఎస్ అగ్రహారంలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేశాయి. గ్రామంలోని పంట పొలాల్లోకి ప్రవేశించిన ఏనుగులు వరి, టమాటా పంటలను తొక్కి నాశనం చేశాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట పొలాల్లోకి వచ్చిన ఏనుగులు బోరు పైపులను సైతం ధ్వంసం చేయడంతో సాగునీటి సౌకర్యానికి కూడా నష్టం వాటిల్లిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయిన ఏనుగుల గుంపు పంట పొలాల నుంచి వెళ్లడం లేదని అన్నదాతలు చెబుతున్నారు.
ఏనుగులను పొలాల్లోకి రానివ్వకుండా కట్టడి చేయడంలో అటవీ శాఖ అధికారులు విఫలమవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. బాణసంచా, టపాకాయలు పేల్చి ఏనుగులను తరిమేందుకు ప్రయత్నించినా అవి బెదరడం లేదని వాపోతున్నారు. ఏనుగుల దాడులతో పంటలు, బోరు పైపులు ధ్వంసమై తీవ్రంగా నష్టపోయామని.. తమను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏనుగుల సంచారాన్ని అరికట్టేందుకు శాశ్వత పరిష్కారంగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

# జగన్ అండ్ కో అసెంబ్లీలో మాట్లాడాలి

**అమరావతి, ఆగస్ట్ 16, అనంతజనశక్తి న్యూస్**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈరోజు (ఆదివారం) విశాఖపట్నంలో మాధవ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ నేతలు కావాలనే తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆగ్రహించారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోవడాన్ని తాము ఖండిస్తున్నామని అన్నారు. అసెంబ్లీకి జగన్ రెడ్డి రావాలని ఆహ్వానించారు. ప్రజా సమస్యలపై జగన్ అండ్ కో అసెంబ్లీలో మాట్లాడాలని.... పారిపోకూడదని పేర్కొన్నారు.

**18న విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం..**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విశాఖపట్నం పర్యటనకు వస్తున్నారని మాధవ్ తెలిపారు. రేపు (సోమవారం) భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆయన చేరుకుంటారని అన్నారు. విమానాశ్రయం ప్రారంభమైన తరుణంలో తమ జాతీయ అధ్యక్షుడు ఇక్కడకు రావడం సంతోషంగా ఉందని చెప్పుకొచ్చారు. జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన మొదటిసారి విశాఖకు వస్తున్నారని తెలిపారు. నితిన్ నబీన్‌కి ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. 18వ తేదీన విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీజేపీ నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ఏపీలో పార్టీ సంస్థాగత నిర్మాణ, రాష్ట్ర ప్రగతిపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో మోదీ చొరవతో పాటు ఏపీలో అభివృద్ధి, నీటి పారుదల ప్రాజెక్ట్‌లపై తీర్మానాలు ఉంటాయని చెప్పారు.
విశాఖపట్నం వేదికగా ఆర్ఎస్ఎస్ సమావేశాలు..
విశాఖపట్నం వేదికగా ఆర్ఎస్ఎస్ సమావేశాలు జరుగుతాయని మాధవ్ వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మోదీ మనస్సులో ఏపీ ఉందని, ఏపీ ప్రజల్లో మోదీ ఉన్నారని ప్రస్తావించారు. మరి కొద్ది రోజుల్లో విశాఖకు గోదావరి జలాలు వస్తాయని వెల్లడించారు. గూగుల్ డేటా సెంటర్ వైజాగ్‌కు వచ్చిందని తెలిపారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రారంభమైందని చెప్పుకొచ్చారు. త్వరలో కొత్త రైల్వేస్టేషన్, కొత్త రైళ్లు వస్తున్నాయని వెల్లడించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించామని అన్నారు. స్థానిక సంస్థలకు కూటమి పార్టీలు కలిసికట్టుగా ముందుకు వెళ్తాయన్నారు. విశాఖ ఎయిర్‌పోర్టు శకం ముగిసిపోవడంతో కొంత బాధగా ఉందని చెప్పారు. విశాఖపట్నం ప్రజలకు ఈ విమానాశ్రయానికి ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు.

**ఈ ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారబోతోంది..**

భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారబోతోందని మాధవ్ ఉద్ఘాటించారు. ఒక లక్షమందికి ఎయిర్‌పోర్టులో ఉపాధి లభించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. సీఎం చంద్రబాబు ఏపీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నారని చెప్పుకొచ్చారు. డేటా సెంటర్లతో తలెత్తే సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గత ఆరు నెలలుగా లాభాల బాటలో నడుస్తోందని వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రివైవల్ ప్యాకేజీ ఇచ్చామని మాధవ్ పేర్కొన్నారు.

# నలుగురు యువకులు గల్లంతు! పెళ్లి సందడి కాస్త విషాదం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు.
కాలువలో గల్లంతైన వారు పోతుల బాను వికాస్ (18), రాజారామ్ (17), నాగిరెడ్డి దుస్వంత్ (18), నాగబత్తుల సాయి సూర్య (19)లుగా గుర్తించారు. వీరంతా నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులుగా పోలీసులు గుర్తించారు. స్నేహితుడి సోదరుడి వివాహానికి హాజరయ్యేందుకు వీరంతా ఐతంపూడి ప్రాంతానికి వెళ్లారు. వివాహ కార్యక్రమం ముగించుకుని తమ స్వగ్రామమైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం మోరి గ్రామానికి తిరిగి వెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. మార్గ మధ్యలో ఐతంపూడి లాకుల సమీపంలో కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లడంతో ఈ విషాదం చోటుచేసుకుంది.
గల్లంతైన యువకుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యల్లో ఇప్పటివరకు ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. పోతుల బాను వికాస్ మృతదేహం ఐతంపూడి వద్ద లభించగా.. నాగిరెడ్డి దుస్వంత్ సాయి మృతదేహం మార్తేరులోని చించినాడ కాలువలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సాయి సూర్య, రాజారామ్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఐతంపూడి లాకుల ప్రాంతంతో పాటు కాలువ పరిసరాల్లో రెస్క్యూ బృందాలు విస్తృతంగా గాలిస్తున్నాయి.
స్నేహితుడి కుటుంబంలో వివాహ వేడుకకు వెళ్లిన యువకులు తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదానికి గురవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. యువకులంతా ఇంజనీరింగ్ విద్యార్థులు కావడంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కారు ఎలా అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది, ప్రమాద సమయంలో వాహన వేగం ఎంత ఉంది వంటి అంశాలను పరిశీలిస్తున్నారు.

# ఏ పార్టీ అధికారంలో ఉన్నా స్కూళ్లు మారలేదు: దీప్కే



దేశంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వ పాఠశాలల దుస్థితి మాత్రం మారలేదని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. పంద్రాగస్టు వేడుకల వేళ.. ప్రభుత్వ పాఠశాలలను బాగుచేయాలనే జాతీయస్థాయి ప్రచారానికి మహారాష్ట్రలోని హింగోలీ జిల్లా నుంచి సీజేపీ శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా తన సొంతూరు సంతుక్ పింప్రీలో జెండా పండుగలో పాల్గొన్న దీప్కే అక్కడున్న జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు కనీస వసతులు లేకపోవడాన్ని, మరుగుదొడ్లలో నీటి సదుపాయం లేని దుస్థితిని పరిశీలించారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 94 వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని, కొత్త బడులు తెరవాల్సిన చోట ఉన్నవి మూసేస్తే దేశం ఎలా బాగుపడుతుందని దీప్కే ప్రశ్నించారు. దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న దారుణమైన పరిస్థితులపైనా త్వరలో ఉద్యమిస్తామన్నారు. ఛత్రపతి సంభాజీనగర్‌లో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ సమక్షంలో జరిగిన తిరంగా ర్యాలీకి ప్రజాధనాన్ని భారీగా ఖర్చు చేశారని.. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, విద్యార్థుల కోసం ఆ డబ్బు ఖర్చు చేసి ఉంటే ఎంతో బాగుండేదన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులకు కళ్లెం వేయాలని దీప్కే డిమాండ్ చేశారు.

**ఇది మా గొంతు నొక్కే ప్రయత్నం**

**కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అధికారిక ఇన్‌స్టాగ్రాం ఖాతా శనివారం ఉదయం కొద్దిసేపు అదృశ్యం కాగా, కాసేపటి తర్వాత పునరుద్ధరించారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా తమ గొంతు నొక్కే ప్రయత్నమే ఈ చర్యగా సీజేపీ ఆరోపించింది. "సీజేపీ వ్యతిరేకులు మా గొంతు నొక్కడానికి భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన్ని ఎంచుకోవడం దురదృష్టకరం. ఇటువంటి చర్యలకు మేము భయపడబోము" అని ఓ పోస్టు ద్వారా వెల్లడించింది. ఈ పని చేసినవారు పిరికిపందలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవం నుంచీ సర్కారీ బడుల సందర్శన సహా పలు కార్యక్రమాలను ప్రారంభిస్తామని సీజేపీ ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. పంద్రాగస్టు ప్రసంగంలో ప్రధాని దేశ యువతను ఉద్దేశించి మాట్లాడి నిరుద్యోగం, విద్యాపరమైన సమస్యలను ప్రస్తావించాలని కూడా సీజేపీ డిమాండ్ చేసింది.**

# మటన్ కొట్టుకు కొత్త కస్టమర్!

**ఉత్తర్‌ప్రదేశ్‌లోని జిల్లా కేంద్రం బారాబంకీలో ఓ మాంసం దుకాణంలోకి శుక్రవారం సాయంత్రం 15 అడుగుల భారీ కొండచిలువ వచ్చింది. దుకాణం లోపల కట్టేసిన మేకల దగ్గరకు అది వెళ్లబోయింది. షాపు యజమాని బిత్తరపోగా.. గుమికూడిన జనంలో నుంచి తూలుతూ ముందుకు వచ్చిన సురేశ్ అనే మందుబాబు ఏమాత్రం భయపడకుండా పామును ఒడిసిపట్టుకొని తన చేతికి చుట్టుకొన్నాడు. ఆ తర్వాత దానిని పూలదండలా తన భుజం చుట్టూ వేసుకొని ఆడుకోవడం మొదలుపెట్టాడు. భారీగా చేరిన జనం విస్తుపోతూ ఆ దృశ్యాన్ని భయం భయంగా చూశారు. కాసేపు ఆ కొండచిలువతో ఆడుకొన్న సురేశ్ ఆ తర్వాత ఓ ప్లాస్టిక్ డ్రమ్ములోకి వదిలి, దూరంగా తీసుకువెళ్లి కాలువలో విడిచిపెట్టాడు.**



# లోకం చుట్టిన మువ్వన్నెల జెండా



80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. భారత్‌కు ప్రపంచ కీలక మిత్ర దేశాలు శుభాకాంక్షలు తెలిపాయి. ఈ సందర్భంగా భారత నాగరికత, ప్రజాస్వామ్యం అంశాలను ప్రస్తావించాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథనీ అల్బనీస్, మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు, నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్, భూటన్ ప్రధాని షేరింగ్ తోబ్గే, మాల్దీవుల మాజీ అధ్యక్షుడు ఇబ్రహీమ్ మొహమ్మద్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోలు ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో పాటు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. భారత్‌తో తమ ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. మరోవైపు, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. సింగపూర్ అధ్యక్షుడు థర్మణ్ శన్ముగరత్నం రాష్ట్రపతి ముర్ముకు ఒక ప్రత్యేక అభినందన లేఖ రాశారు. భారత్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తూనే ఉంటామని ఆయన లేఖలో పేర్కొన్నారు.

**భారత్‌కంటే ముందు ఫిజీలో...**

మరోవైపు, సూర్యపథ్ తిరంగా కార్యక్రమంలో భాగంగా.. ఫిజీ నుంచి శాన్ ఫ్రాన్సిస్కో వరకు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50 దేశాల్లో ఉన్న భారతీయ రాయబార కార్యాలయాల్లో వరుసగా త్రివర్ణ జెండా ఎగరవేశారు. ఈ సంవత్సరం భారత్ కంటే ముందుగా.. పసిఫిక్ ద్వీప దేశమైన ఫిజీలో భారత 80వ స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. భారత కాలమానం ప్రకారం రాత్రి 1:30 గంటలకు (ఫిజీ కాలమానం ప్రకారం ఉదయం 8 గంటలకు) అక్కడ కార్యక్రమం ప్రారంభమైంది. అక్కడి ఇండియా హౌస్‌లో హై కమిషనర్ సునీత్ మెహతా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య వేడుకల్లో చివరిగా.. శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత దౌత్య కార్యాలయం జెండాను ఎగురవేసింది. అన్ని కాలమండలాల్లో పనిచేస్తున్న భారత రాయబార కార్యాలయాలు, ప్రపంచవ్యాప్త భారతీయుల భాగస్వామ్యంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకొంటూ.. నిరంతర ఉత్సవ అనుభూతిని సృష్టించడానికి సూర్యపథ్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టారు.

## యువశక్తిని వాడుకుంటే విశ్వగురువులం: భాగవత్

దేశ యువత మనకు సంఖ్యాపరమైన వరమని, యువశక్తిని సరైన రీతిలో వాడుకుంటే విశ్వగురువుగా భారత్ అవతరిస్తుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధిపతి మోహన్ భాగవత్ పేర్కొన్నారు. ఒకవేళ వారి శక్తిసామర్థ్యాలను తగిన విధంగా వాడుకోకపోతే మాత్రం అది దేశానికి భారీ గుదిబండ అవుతుందని, ప్రస్తుత యువతరం మరో 30 ఏళ్లకు వృద్ధాప్యంల□కి వచ్చేస్తుందని చెప్పారు. లోక్‌మత్ మీడియా గ్రూపు ఆధ్వర్యంలో శనివారం నాగ్‌పుర్‌లోని కస్తూర్‌చంద్ పార్కులో జరిగిన కార్యక్రమంలో యువజనులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 200 అడుగుల ఎత్తున జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. "ప్రజలకు ఉపయోగపడే అంశాలను ప్రస్తావించే విపక్షం, ఉద్యమాలు ప్రజాస్వామ్యంలో అవసరం. రాజ్యాంగానికి, చట్టాలకు భంగం కలిగించకుండా చర్చలు, వాదనలు కొనసాగాల్సిందే. యువత తమ కోసమే కాకుండా భవిష్య తరాల అవసరాల కోసమూ ఆలోచించాలి. తమతోపాటు దేశ భవితను రూపొందించుకునేందుకు పాటుపడాలి" అని భాగవత్ చెప్పారు.



# యువ లాయర్లు దేశాభివృద్ధి బాధ్యతను భుజాలకెత్తుకోవాలి



భారత స్వాతంత్ర్య పోరాటంతో న్యాయవాద వృత్తికి లోతైన అనుబంధం ఉందని.. ఆ నాటి న్యాయనిపుణుల దార్శనికత, కృషి ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించాయని భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఆధునిక భారత రూపశిల్పులైన మహాత్మాగాంధీ, బి.ఆర్.అంబేద్కర్‌లతో సహా సర్దార్ వల్లభ్‌భాయీ పటేల్, మోతీలాల్ నెహ్రూ, బాలగంగాధర తిలక్, లాలా లజపత్‌రాయ్ వంటి నేతలంతా న్యాయవాదులేనని గుర్తు చేశారు. నాటి స్వాతంత్ర్య పోరులో వీరంతా ప్రేక్షకపాత్ర పోషించకుండా, అంతర్భాగంగా మారినట్లు తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా అత్యున్నత న్యాయస్థాన ఆవరణలో శనివారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో సీజేఐ మాట్లాడారు. గత ఎనిమిది దశాబ్దాల్లో దేశం ఎన్నో కఠిన సవాళ్లను అధిగమించిందని, మునుముందు ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. నేటి యువ న్యాయవాదులు ముందుకువచ్చి ఈ బాధ్యతలను భుజాలకు ఎత్తుకోవాలని పిలుపునిచ్చారు. తామంతా మార్గం చూపి, వెంట నడుస్తామన్నారు. "ఒక దేశ ప్రయాణం అది సాధించిన విజయాలతోనే ఆగిపోదు. ప్రతి విజయం మరిన్ని బాధ్యతలను, విధులను మోసుకొస్తుంది. చట్టం అంటే కేవలం ఆజ్ఞాపించడం మాత్రమే కాదు.. న్యాయం అందించాలి, స్వేచ్ఛను కాపాడాలి, మానవతా గౌరవాన్ని నిలబెట్టాలి. ఈ దేశ అంతరాత్మను తీర్చిదిద్దడంలో మన న్యాయవ్యవస్థలు కీలకపాత్రను పోషించాయి" అని తెలిపారు.

# 'శాంతి' చట్టం ముసాయిదా నిబంధనల విడుదల

అణు రియాక్టర్లకు సంబంధించి 'సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ' (శాంతి) చట్టం 2025 ముసాయిదా నిబంధనలను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. అణు ప్రమాదాలు జరిగిన సమయంలో పరిహారం కోసం రియాక్టర్ల నిర్వాహకులు బీమా విధానం, ఆర్థిక భద్రత లేదా రెండింటి మిశ్రమాన్ని కొనసాగించాలని పేర్కొంది. వాడేసిన ఇంధనాన్ని (స్పెంట్ ఫ్యూయెల్) స్టోరేజ్ పూల్ నుంచి పూర్తిగా తొలగించే వరకూ ఆర్థిక భద్రత కొనసాగాలని స్పష్టంచేసింది. అణుశక్తి విభాగం విడుదల చేసిన ముసాయిదాలో ముఖ్యాంశాలివీ.. అణు ప్రమాదం సంభవించిన సమయంలో రియాక్టర్ నిర్వాహక సంస్థకు ఉండే పౌర బాధ్యతపై పరిమితిని సమీక్షించడానికి కేంద్రం ఐదేళ్లకోసారి నిపుణులకమిటీని ఏర్పాటు చేస్తుంది. ఒకవేళ సంబంధిత అణు కర్మాగారం లేదా రియాక్టర్‌ను విదేశాల్లో డిజైన్ చేసి ఉంటే.. దాన్ని సంబంధిత దేశంలోని నియంత్రణ సంస్థ ఆమోదించి ఉండాలి. ఇక్కడ.. 'విదేశం' అంటే అణు రియాక్టర్ డిజైన్, సరఫరాగొలుసు వ్యవస్థల్లో స్వయం సమృద్ధి సాధించిన దేశమని అర్థం. అక్కడి నియంత్రణ సంస్థలు ఇచ్చే అనుమతులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు కలిగి ఉండాలి.



**అలాంటి రియాక్టర్.. సంబంధిత దేశంలో కానీ మరేదైనా దేశంలో కానీ వాడుకలో ఉండాలి.**

రియాక్టర్ ఏర్పాటుకు దరఖాస్తు వచ్చాక.. దాని నిర్మాణ ప్రదేశం లేదా సాంకేతిక పరిజ్ఞానం ఆమోదం ఇంకా పొందని సందర్భాల్లో లైసెన్సింగ్ సంస్థ సూత్రప్రాయ అంగీకారాన్ని తెలపవచ్చు. ఆ తర్వాత దరఖాస్తుదారు.. రియాక్టర్ టెక్నాలజీ విక్రేతలతోను, భూసేకరణ, ఇతర మౌలిక వసతులపై సంబంధిత వ్యక్తులతోను చర్చలు జరుపుకోవచ్చు. అణు విద్యుత్ కర్మాగారం లేదా రియాక్టర్ నిర్మాణం, యాజమాన్యం, నిర్వహణ, ఉపసంహరణ వంటి అన్ని అంశాలకు అనుమతినిస్తూ ఒకే లైసెన్సు ఉంటుంది.

## కాంగ్రెస్ కార్యాలయంలో పూర్తి వందేమాతరంపై వివాదం




కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన స్వాతంత్ర్యదిన వేడుకలపై దుమారం రేగింది. జెండావందనం సందర్భంగా..వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ మధ్యలోనే అడ్డుకున్నారని భాజపా ఆరోపించింది. దీనికి సంబంధించిన వీడియో దృశ్యాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. "తల్లి, తనయుడు, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పూర్తి వందేమాతరాన్ని ఆలపించడానికి ఇష్టపడుతున్నట్లు లేదు. కొందరి ఆలోచనాధోరణి 1947కి పూర్వం ఎలా ఉందో ఆ తర్వాతా అలాగే ఉంది" అని విమర్శించారు. వందేమాతరం పూర్తి గేయాన్ని ఎందుకు వేశారంటూ కార్యకర్తల్ని సోనియా ప్రశ్నించారని, అది ఎంతో సిగ్గుచేటు అని భాజపా అధికార ప్రతినిధి గోపాలకృష్ణ అగర్వాల్ మండిపడ్డారు. భాజపా విమర్శలకు కాంగ్రెస్ వివరణిచ్చింది. వివాదమేమీ లేదని కొట్టిపారేసింది. ఎక్కువసేపు నిల్చొని ఉన్న ఖర్గేకు కుర్చీ వేయాల్సిందిగా సోనియా సైగ చేశారని, గేయాన్ని ఆపాలని కాదని స్పష్టం చేసింది.

## పార్టీ కార్యాలయంలో.. మమతా బెనర్జీ సన్నిహితుడి ఆత్మహత్య



బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సన్నిహితుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున బీర్భూమ్ జిల్లాలోని పార్టీ కార్యాలయం లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన ఇంటికి సమీపంలోనే పార్టీ కార్యాలయం ఉంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపి ఘటనపై దర్యాప్తు చేపట్టారు. తృణమూల్ నేత మృతి విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఆశిష్ బెనర్జీ రాంపుర్హాట్ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2001 నుంచి 2026 వరకు 25 ఏళ్లపాటు ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. బెంగాల్ విద్యా, వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేశారు. 2021లో రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా విధులు నిర్వర్తించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా నేత ధ్రువ్ సాహా చేతిలో ఓటమి పాలయ్యారు. కార్యాలయంలో సూసైడ్ నోట్ లభ్యమైంది. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ అవినీతికి పాల్పడలేదని.. ఎలాంటి తప్పు చేయలేదని అందులో ఆశిష్ పేర్కొన్నారు. తాను ఛైర్‌పర్సన్‌గా పనిచేసిన తారాపీఠ్ రాంపుర్హాట్ డెవలప్‌మెంట్ అథారిటీ (టీఆర్‌డీఏ)కి సంబంధించిన అవకతవకల్లో తనపై అసత్య ఆరోపణలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని రాసుకొచ్చారు. రాజకీయాల్లోకి రావడమే జీవితంలో తాను చేసిన పొరపాటని పేర్కొన్నారు.

## 98వ ఏట జెండా ఎగరేసిన ఆడ్వాణీ



భాజపా సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే ఆడ్వాణీ శనివారం తన నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. 98ఏళ్ల ఆయన పృథ్వీరాజ్ రోడ్డులోని నివాసంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా మువ్వన్నెల జెండాను ఎగరేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాంచీలో విద్యార్థుల తిరంగా యాత్ర



**ఝార్ఖండ్ రాజధాని రాంచీలో ఉద్యోగ నియామక పరీక్షల్లో జరిగిన అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన ఆందోళన శనివారం 22వ రోజుకు చేరింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా విద్యార్థులు దీక్షాస్థలి అయిన జైపాల్‌సింగ్ ముండా స్టేడియం నుంచి ఆల్బర్ట్ ఎక్కా కూడలి వరకు తిరంగా యాత్ర నిర్వహించారు. 'జేపీఎస్సీ - జేఎస్ఎస్‌సీ సంస్కరణల వేదిక' ఆధ్వర్యంలో చేపట్టిన ఈ యాత్రకు వేల సంఖ్యలో ఉద్యోగార్థులైన విద్యార్థులు, వారి మద్దతుదారులు హాజరయ్యారు. జాతీయ పతాకాలను చేతబట్టి 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో విద్యార్థులు ముందుకు సాగారు. కాగా, స్వాతంత్ర్య దిన వేడుకలతోపాటు తిరంగా ర్యాలీలో పాల్గొనకుండా పోలీసులు తనను అడ్డుకున్నారని గత 14 రోజులుగా నిరాహార దీక్ష చేస్తూ, సదర్ ఆసుపత్రి పర్యవేక్షణలో ఉంటున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్ర మహతో ఆరోపించారు. ఈ మేరకు వీడియోలు కూడా సామాజిక మాధ్యమాల ద్వారా బయటకు వచ్చాయి. శుక్రవారం రాత్రి నుంచే ఆసుపత్రిలోని తన గది బయట పోలీసు బందోబస్తు పెంచారని మహతో తెలిపారు.**

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం | రంగారెడ్డి
17.08.2026





# ప్రయోగశాలలో వజ్రయాగం

భూమి కొన్ని కోట్ల సంవత్సరాల్లో సృష్టించే వజ్రం ఇప్పుడు ఐఐటీ మద్రాస్ ప్రయోగశాలలో కొన్ని వారాల్లోనే తయారవుతోంది. కేవలం ఆభరణాల కోసమే కాకుండా, భవిష్యత్తు కంప్యూటర్ చిప్‌లు, క్వాంటమ్ పరికరాలు, ఉపగ్రహాలు, క్యాన్సర్ వైద్యానికీ అది కీలకంగా నిలవనుంది. తెలుగువారైన ఐఐటీ ప్రొఫెసర్ ఎం.ఎస్.రామచంద్రరావు నామకరణం చేసిన ‘డైమండ్‌ట్రానిక్స్’ అనే భావన ఇప్పుడు ప్రాచుర్యం పొందుతోంది. దానిద్వారా భారత్ సరికొత్త వజ్ర సాంకేతిక విప్లవానికి సిద్ధమవుతోంది.

బొగ్గు లేదా పెన్సిల్ ముల్లులో ఉండే కార్బనే భూమి లోపల విపరీతమైన వేడి, పీడనం వల్ల వజ్రంగా మారుతుంది. ఇప్పుడు అదే వజ్రం ప్రయోగశాలలో పుడుతోంది. రసాయనపరంగా, భౌతికంగా సహజ వజ్రంతో ఎలాంటి వ్యత్యాసం లేకుండా, పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా అది తయారవుతోంది. ల్యాబ్ గ్రోన్ డైమండ్ల పరంగా ప్రపంచంలోనే అగ్రస్థానానికి ఎదగాలని ఇండియా లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో 2023 కేంద్ర బడ్జెట్లో ఐఐటీ మద్రాస్‌కు దాదాపు రూ.243 కోట్లు మంజూరు చేసి, ఇన్‌సెంట్-ఎల్‌జీడీ (ఇండియా సెంటర్ ఫర్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్) పేరుతో ఒక పరిశోధన కేంద్రాన్ని స్థాపించారు. డైమండ్ సాంకేతికతలో దాదాపు రెండు దశాబ్దాల అనుభవం ఉన్న ప్రొఫెసర్ ఎం.ఎస్.రామచంద్రరావు నేతృత్వంలో అక్కడ ల్యాబ్‌గ్రోన్ వజ్రాలు రూపొందిస్తున్నారు.

**ఎన్నో రంగాల్లో ఉపయోగాలు...**

ఫోన్లు, కంప్యూటర్లు, టీవీలు సిలికాన్ చిప్‌ల మీదే నడుస్తున్నాయి. సాధారణ చిప్‌లలో సిలికాన్‌కు బదులుగా వజ్రాలను సెమీకండక్టర్లుగా వాడే సరికొత్త టెక్నాలజీయే ‘డైమండ్‌ట్రానిక్స్’. భవిష్యత్తు ఎలక్ట్రానిక్స్ రంగాన్ని మార్చబోతున్న విప్లవంగా దీన్ని అభివర్ణిస్తున్నారు. అధిక వేడి, శక్తి ఉత్పత్తి అయ్యే పరిస్థితుల్లో సిలికాన్ పరిమితులు బయటపడతాయి. రాకెట్లు, యుద్ధ విమానాలు, ఉపగ్రహాల్లో వేలాది డిగ్రీల వేడి పుడుతుంది. అక్కడ సిలికాన్ పనిచేయడం కష్టమవుతుంది. కార్బన్ అణువులు అత్యంత దట్టంగా, క్రమబద్ధంగా అమరిన వజ్ర నిర్మాణం వేడిని చాలా వేగంగా బయటికి పంపిస్తుంది. అధిక వేడిని తట్టుకోవడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ లక్షణాలను మార్చుకోవడం- ఈ రెండూ ఒకేదానిలో ఉండటం అరుదు. అందుకే సిలికాన్ యుగం అనంతరం భవిత వజ్ర సాంకేతికతదేనని ప్రపంచం భావిస్తోంది.

డైమండ్‌ట్రానిక్స్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలు అబ్బురపరుస్తున్నాయి. వజ్రంలోని ఒక కార్బన్ అణువు స్థానంలో నైట్రోజన్‌ను ఉంచి, పక్కనే ఒక చిన్న ఖాళీని వదిలేస్తే.. అది ఒక కృత్రిమ అణువులా పనిచేస్తుంది. దీనిపై పచ్చని లేజర్ కాంతిని ప్రసరింపజేస్తే, అది ఎర్రటి కాంతిని బయటికి పంపుతుంది. చుట్టూ ఉన్న అయస్కాంత శక్తిని బట్టి ఈ ఎర్రటి కాంతి లక్షణాలు మారిపోతాయి. అంటే, ఇది అణు పరిమాణంలో ఉండే ఒక సూపర్ సెన్సర్‌లా పనిచేస్తుందన్నమాట! వాటిద్వారా సాధారణ పరికరాలతో గుర్తించలేని క్యాన్సర్ కణాల ఉనికిని వజ్రాలతో రూపొందించిన క్వాంటం సెన్సర్లతో కచ్చితంగా పసిగట్టవచ్చు. జీపీఎస్ సిగ్నళ్లు లేని చోట భూమికి ఉండే అయస్కాంత క్షేత్రాన్ని ఆధారం చేసుకుని పనిచేసే క్వాంటమ్ సెన్సర్లతో వస్తువులను, మనుషులను కచ్చితత్వంతో గుర్తించవచ్చు. ఇన్‌సెంట్ ఎల్‌జీడీలో అలాంటి వజ్రాలనూ రూపొందిస్తున్నారు. అంతేకాదు, క్వాంటమ్ కంప్యూటర్లలో సమాచారాన్ని దాచుకునే మెమొరీ చిప్(క్విబిట్)లా పనిచేసే అద్భుత సామర్థ్యం కూడా దీనికి ఉంది. మరీ ముఖ్యంగా, ప్రపంచంలోని చాలా క్వాంటమ్ పరికరాలు పనిచేయాలంటే మైనస్ 273డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు వాటిని చల్లబరచాలి. ఈ వజ్రాల సాంకేతికత మన ఇంట్లోని సాధారణ గది ఉష్ణోగ్రత దగ్గరే అద్భుతంగా పనిచేస్తుంది! శాటిలైట్ సెన్సర్లు, 5జీ నెట్‌వర్క్, మిలిటరీ రాడార్లు, మెషిన్ల కోటింగ్స్, బయోమెడిసిన్ ఇలా ఎన్నో రంగాల్లో వజ్రం ఉపయోగపడటం నిజంగా ఒక అద్భుతం!

**భారీగా ఉపాధి అవకాశాలు**

నిరుడు ప్రపంచ ల్యాబ్ గ్రోన్ వజ్రాల మార్కెట్ విలువ 2,946 కోట్ల డాలర్లకు చేరింది. 2034 నాటికి అది 9,185 కోట్ల డాలర్లకు పెరుగుతుందని అంచనా. వీటి ఉత్పత్తిలో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో నిలుస్తోంది. మనదగ్గర ఏటా 30 లక్షలకు పైగా వజ్రాలు ల్యాబుల్లో తయారవుతున్నాయి. 2025 ఏప్రిల్ నాటికి భారత్ ఎగుమతుల్లో అవి సహజ వజ్రాల సంఖ్యను దాటిపోయాయి. గతేడాది ‘వైరమ్’ (వజ్రపరిశ్రమ-పరిశోధన- విద్యాసమ్మేళనం)లో మన దేశం సొంతంగా తయారు చేసిన వజ్రాల మెషిన్లను శాస్త్రవేత్తలు ప్రదర్శించారు. ల్యాబ్‌లో వజ్రం పెరగడానికి కావాల్సిన శక్తినిచ్చే ప్రధాన ఇంజిన్ ‘ఎస్ఎస్ఎమ్‌జీ’ (సాలిడ్ స్టేట్ మైక్రోవేవ్ జనరేటర్) సాంకేతికతను కూడా ఇండియాలోనే విజయవంతంగా తయారు చేస్తున్నారు. దాన్ని ప్రైవేట్ కంపెనీలకూ ఇవ్వనుండటంతో, దేశంలో ఎన్నో కొత్త పరిశ్రమలు ఆవిర్భవించి వేలాది మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. కార్బన్ అణువుల నుంచి భవిష్యత్తు సాంకేతికతను నిర్మించే ఈ వైజ్ఞానిక కృషి నిజంగానే ఒక ఆధునిక వజ్రయాగం.



# ఇంజనీరింగ్ విద్య భవిష్యత్తు:

# డిగ్రీల సంఖ్య కాదు.. నైపుణ్యాలే కీలకం

**తెలంగాణలో ఇంజనీరింగ్ విద్య భవిష్యత్తుపై మరోసారి విస్తృత చర్చకు తెరలేచింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ పట్టభద్రుల ఉద్యోగ సాధికారతపై ఆందోళన వ్యక్తం చేస్తూ, తగిన ప్రాయోగిక నైపుణ్యాలు లేకుండా పెద్ద సంఖ్యలో ఇంజనీరింగ్ పట్టభద్రుల తయారు చేయడం మానవ వనరుల సామర్థ్యాన్ని వృథా చేయడమేనని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీసింది, వాటి వెనుక ఉన్న అసలు ప్రశ్న మాత్రం మరింత విస్తృతమైనది. కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, డిజిటల్ టెక్నాలజీలు వేగంగా మారుతున్న ఈ కాలంలో ఒక ఇంజనీరింగ్ డిగ్రీకి అసలు అర్థం ఏమిటి? భవిష్యత్ అవసరాలకు సరిపోయే ఇంజనీర్లను మన విద్యా వ్యవస్థ తయారు చేస్తోందా? తెలంగాణలో ప్రతి సంవత్సరం సుమారు 1.1 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు పట్టభద్రులవుతున్నారు. ఇది రాష్ట్రానికి అపారమైన యువ మానవ వనరులను అందిస్తున్నప్పటికీ, కేవలం డిగ్రీ ఉండటం ఉద్యోగానికి హామీ ఇవ్వడం లేదు. పరిశ్రమలు ప్రస్తుతం ప్రాయోగిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, డిజిటల్ పరిజ్ఞానం, బృందంగా పనిచేసే సామర్థ్యం, కొత్త సాంకేతికతలను నేర్చుకునే సామర్థ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి.అందువల్ల సమస్య ఇంజనీరింగ్ పట్టభద్రుల సంఖ్య మాత్రమే కాదు. తరగతి గదిలో విద్యార్థులు నేర్చుకునే అంశాలకు, పరిశ్రమ మరియు సమాజం కోరుకునే నైపుణ్యాలకు మధ్య పెరుగుతున్న అంతరమే అసలు సవాలు.**

**డిగ్రీ ఒక్కటే సరిపోదు**

ఇంజనీరింగ్ విద్యకు గణితం, సైన్స్, ప్రాథమిక ఇంజనీరింగ్ సూత్రాలు పునాదులు. ఆ పునాదుల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదు. అయితే ఉద్యోగ ప్రపంచం వేగంగా మారుతోంది.నేటి ఇంజనీర్ కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డిజిటల్ ట్విన్స్, ఆటోమేషన్, ఆధునిక తయారీ సాంకేతికత వంటి రంగాలతో పనిచేయాల్సి వస్తోంది. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి సంప్రదాయ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులు కూడా డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్య పూర్తిచేసిన విద్యార్థి ఒక ఉపయోగకరమైన ప్రాజెక్ట్‌ను రూపొందించలేకపోతే, వాస్తవ సమస్యను విశ్లేషించలేకపోతే, తన ఆలోచనను సమర్థవంతంగా వివరించలేకపోతే లేదా సాంకేతిక సాధనాలను ఉపయోగించలేకపోతే ఉద్యోగ మార్కెట్‌లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందువల్ల ఇంజనీరింగ్ విద్య డిగ్రీ ఆధారిత విద్య నుంచి నైపుణ్యాలు, సామర్థ్యాల ఆధారిత విద్య వైపు మళ్లాలి.

**ప్రభుత్వ ఉన్నత విద్య బలోపేతం చేయాలి**

ఇంజనీరింగ్ విద్య చర్చ జరుగుతున్నప్పుడు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల పరిస్థితిని కూడా విస్మరించకూడదు.ప్రభుత్వ ఉన్నత విద్యా వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే సమాజంలో అన్ని వర్గాలకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుంది. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక, బోధనేతర సిబ్బంది కొరత, మౌలిక వసతుల లోపం, పరిశోధనకు తగిన ప్రోత్సాహం లేకపోవడం వంటి సమస్యలు ఉన్నట్లయితే వాటిని తక్షణమే పరిష్కరించాలి.కొత్త విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయడం మాత్రమే ఉన్నత విద్యా విస్తరణ కాదు. వాటిలో తగిన సంఖ్యలో అధ్యాపకులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, పరిశోధన వాతావరణ, విద్యార్థి సహాయక వ్యవస్థ, ఆధునిక సాంకేతిక వసతులు ఉండాలి.తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల నియామకాలు పరిస్థితిపై కూడా సమగ్ర సమీక్ష అవసరం. ఉన్నత విద్యా సంస్థల్లో అధ్యాపక పోస్టుల భర్తీ చేయకుండా విద్యా నాణ్యత పెంచడం సాధ్యం కాదు.

విద్యార్థులు లేకుండా విశ్వవిద్యాలయం నడవదు;అధ్యాపకులు లేకుండా విశ్వవిద్యాలయం ఎదగదు.

**ప్రైవేటు ఉన్నత విద్యలో నాణ్యతపై దృష్టి అవసరం**

ఇటీవలి కాలంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలలు గణనీయంగా పెరిగాయి.



ఇది ఉన్నత విద్య అవకాశాలు విస్తరించినప్పటికీ, నాణ్యతపై మరింత కఠినమైన పర్యవేక్షణ అవసరాన్ని కూడా పెంచింది.కొన్ని ప్రైవేటు సంస్థల్లో కోర్ ఇంజనీరింగ్ బ్రాంచీల కంటే మార్కెట్ డిమాండ్ ఉన్న కోర్సులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం కనిపిస్తోంది. అదే సమయంలో సామాజిక శాస్త్రాలు, ప్రాథమిక సైన్స్, హ్యూమానిటీస్, లిబరల్ ఆర్ట్స్, న్యాయ విద్య వంటి విభాగాలకు తగిన ప్రాధాన్యత లేకపోవడం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రతికూలంగా మారే ప్రమాదం ఉంది.ఒక విశ్వవిద్యాలయం కేవలం అడ్మిషన్లు, ఫీజులు, ప్లేస్‌మెంట్ల చుట్టూ తిరిగే వాణిజ్య వ్యవస్థగా మారకూడదు. అది జ్ఞానాన్ని సృష్టించే, పరిశోధనను ప్రోత్సహించే, సమాజానికి ఉపయోగపడే పరిష్కారాన్ని అందించే విద్యా కేంద్రంగా ఉండాలి.పబ్లిక్ రిలేషన్స్ సిబ్బంది, అడ్మిషన్ సిబ్బంది, హెచ్ ఆర్ సిబ్బంది సంఖ్య కంటే నాణ్యమైన అధ్యాపకులు, పరిశోధకులు, ప్రయోగశాలలు, విద్యార్థి అభ్యాస వాతావరణం ముఖ్యమైనవి.

**నియంత్రణ వ్యవస్థ మరింత పారదర్శకంగా ఉండాలి**

ఇంజనీరింగ్ విద్యా నాణ్యతను కాపాడటంలో యుజిసి, ఏఐసిటిఈ, న్యాక్, ఎన్బిఏ విశ్వవిద్యాలయాలు వంటి నియంత్రణ, గుర్తింపు సంస్థల పాత్ర అత్యంత కీలకం.కళాశాలలకు గుర్తింపులు, అనుమతులు, అక్రిడిటేషన్లు, అటానమస్ హోదాలు కేవలం పత్రాల ఆధారంగా కాకుండా వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఇవ్వాలి. అధ్యాపకుల సంఖ్య, వారి అర్హతలు, ప్రయోగశాలలు, తరగతి గదులు, పరిశోధన, గ్రంథాలయాలు, విద్యార్థుల అభ్యసన ఫలితాలు, ఆర్థిక పారదర్శకత వంటి అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించాలి.ప్రైవేటు కళాశాలల్లో నకిలీ అధ్యాపకులు, నకిలీ అర్హతలు లేదా నకిలీ డాక్టరేట్లకు సంబంధించిన ఆరోపణలు వస్తే వాటిపై స్వతంత్రంగా, పారదర్శకంగా విచారణ జరిపి, నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలి. అధ్యాపకులకు నెలల తరబడి జీతాలు చెల్లించని సంస్థలు నాణ్యమైన విద్యను ఎలా అందిస్తాయన్న ప్రశ్న కూడా సహజంగానే తలెత్తుతుంది.అక్రిడిటేషన్ అనేది విద్యా నాణ్యతకు ధ్రువీకరణ కావాలి; కేవలం ఒక సర్టిఫికెట్‌గా మారకూడదు.

**ఖాళీ సీట్ల వైరుధ్యం**

తెలంగాణలో ఇంజనీరింగ్ విద్య మరో విచిత్రమైన వైరుధ్యాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు ప్రతి సంవత్సరం భారీ సంఖ్యలో విద్యార్థులు ఇంజనీరింగ్‌లో చేరుతుండగా, మరోవైపు కొన్ని కళాశాలలు, కొన్ని బ్రాంచీల్లో గణనీయమైన సంఖ్యలో సీట్లు ఖాళీగా మిగులుతున్నాయి.దీనికి ప్రధాన కారణాల్లో విద్యార్థుల బ్రాంచ్ ప్రాధాన్యత, కళాశాల ప్రతిష్ఠ, ప్లేస్‌మెంట్ రికార్డు, మౌలిక వసతులు, భౌగోళిక స్థానం, రవాణా సౌకర్యాలు, ఫీజు నిర్మాణం, కౌన్సెలింగ్ విధానం వంటి అంశాలు ఉన్నాయి.ప్రస్తుతం విద్యార్థులు ప్రధానంగా కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి విభాగాల వైపు పరుగులు తీస్తున్నారు. మరోవైపు సివిల్, మెకానికల్, కొన్ని ఎలక్ట్రికల్ బ్రాంచీలకు డిమాండ్ తగ్గుతోంది.ఇది విద్యార్థుల తప్పు మాత్రమే కాదు. ఉపాధి అవకాశాలపై ఉన్న అవగాహన, కుటుంబాల ఆర్థిక పరిస్థితి, కళాశాలల నాణ్యత, పరిశ్రమల అవసరాలు వంటి అనేక అంశాలు ఈ నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి.కాబట్టి ఖాళీ సీట్ల సమస్యను కేవలం అడ్మిషన్ల సమస్యగా చూడకుండా, ఇంజనీరింగ్ విద్యా ప్రణాళిక, పరిశ్రమ అవసరాలు, ఉపాధి మార్కెట్ మధ్య సమన్వయం లోపంగా చూడాలి.

**సీఎస్ఈ వైపు పరుగులు: అవకాశమా? ప్రమాదమా?**

కంప్యూటర్ సైన్స్, ఏఐ సంబంధిత కోర్సులకు పెరుగుతున్న డిమాండ్ సహజమే. అయితే ప్రతి విద్యార్థి సిఎస్ఈ చదవాల్సిందే అన్న భావన భవిష్యత్తులో సమస్యలను సృష్టించే అవకాశం ఉంది.సంప్రదాయ కోర్సులకు ఏఐ , డేటా సైన్స్, ఎంఎల్ వంటి ఆకర్షణీయమైన పేర్లు పెట్టడం వల్ల మాత్రమే భవిష్యత్ ఇంజనీర్లు తయారుకారు. గణిత శాస్త్రం, అల్గారిథమ్స్, ప్రోగ్రామింగ్ పునాదులు, సిస్టమ్స్ థింకింగ్, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార సామర్థ్యం వంటి పునాది నైపుణ్యాలు తప్పనిసరి.జనరేటివ్ ఏఐ ఇప్పటికే ప్రోగ్రామింగ్, డాక్యుమెంటేషన్, టెస్టింగ్, డీబగ్గింగ్ వంటి పనుల్లో సహాయపడుతుంది. రాబోయే కాలంలో ఏఐ అనేక సాధారణ సాంకేతిక పనులను మరింత సులభతరం చేయనుంది.కాబట్టి భవిష్యత్ ఇంజనీర్ కేవలం కోడ్ రాసే వ్యక్తిగా కాకుండా సమస్యను గుర్తించగల, పరిష్కారాన్ని రూపొందించగల, ఏఐ ఫలితాలను ధృవీకరించగల, నైతిక అంశాలను అర్థం చేసుకోగల, తుది నిర్ణయానికి బాధ్యత వహించగల నిపుణుడిగా ఎదగాలి.

**కోర్ ఇంజనీరింగ్‌కు భవిష్యత్తు ఉంది**

సంప్రదాయ ఇంజనీరింగ్ బ్రాంచీలకు ఆదరణ తగ్గుతున్నప్పటికీ, వాటి ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో మాత్రమే రహదారులు, వంతెనలు, నీటి వనరులు, విద్యుత్ వ్యవస్థలు, తయారీ పరిశ్రమలు, రవాణా మౌలిక వసతులు, సుస్థిర నగరాలు నిర్మించడం సాధ్యం కాదు.సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ వంటి విభాగాలు దేశ ఆర్థికాభివృద్ధికి ఇప్పటికీ కీలకమైనవి. అయితే ఈ బ్రాంచీల బోధనా విధానం మారాలి. సివిల్ ఇంజనీరింగ్‌లో జిఐఎస్ , బిఐఎం, రిమోట్ సెన్సింగ్, డ్రోన్లు, డేటా అనలిటిక్స్, సుస్థిర మౌలిక వసతులు వంటి అంశాలను అనుసంధానించాలి. మెకానికల్ ఇంజనీరింగ్‌లో రోబోటిక్స్, క్యాడ్ /క్యామ్ , ఆటోమేషన్, 3డి ప్రింటింగ్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పునరుత్పాదక ఇంధనం, స్మార్ట్ గ్రిడ్లు, ఎనర్జీ స్టోరేజ్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఇంటెలిజెంట్ కంట్రోల్ సిస్టమ్స్ వంటి రంగాలను విస్తృతంగా బోధించాలి. భవిష్యత్తు కంప్యూటర్ సైన్స్‌తో కోర్ ఇంజనీరింగ్‌ను భర్తీ చేయడంలో లేదు; కంప్యూటింగ్, ఏఐ , డిజిటల్ టెక్నాలజీలను ప్రతి ఇంజనీరింగ్ విభాగంతో అనుసంధానించడంలో ఉంది.

**క్యాంపస్ నుంచి పరిశ్రమ వైపు**

ఇంజనీరింగ్ విద్యా సంస్థలు పరిశ్రమతో మరింత బలమైన సంబంధాన్ని ఏర్పరచుకోవాలి.ఇంటర్న్‌షిప్‌లు కేవలం సర్టిఫికెట్ కోసం చేసే కార్యక్రమాలుగా ఉండకూడదు. విద్యార్థులు పరిశ్రమల్లో వాస్తవ సమస్యలను అర్థం చేసుకునేలా చేయాలి. మల్టీడిసిప్లినరీ ప్రాజెక్టులు, పరిశ్రమ ఆధారిత ప్రయోగశాలలు, స్టార్టప్‌లు, పరిశోధన, ఓపెన్ సోర్స్ ప్రాజెక్టులు, సామాజిక సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు వంటి అంశాలను విద్యలో భాగం చేయాలి.చివరి సంవత్సరం ప్రాజెక్ట్ కూడా ఒక ఫార్మాలిటీగా మారకూడదు. విద్యార్థి ఒక సమస్యను గుర్తించి, దానికి సంబంధించిన పరిష్కారాలను అధ్యయనం చేసి, పరిష్కారాన్ని రూపొందించి, అమలు చేసి, ఫలితాలను విశ్లేషించే సామర్థ్యాన్ని ప్రదర్శించాలి.

ఉద్యోగానికి దరఖాస్తు చేయడం కూడా ఒక నైపుణ్యమే ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగ దరఖాస్తు నైపుణ్యాలపై శిక్షణ అవసరం.రెజ్యూమ్ తయారీ, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, కమ్యూనికేషన్, ఆప్టిట్యూడ్, గ్రూప్ డిస్కషన్, ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్, కార్యాలయ నైతికత, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి అంశాలను ఇంజనీరింగ్ విద్యలో భాగం చేయాలి.విద్యార్థి కళాశాల నుంచి బయటకు వచ్చేటప్పుడు కేవలం డిగ్రీ సర్టిఫికెట్‌తో కాకుండా తన నైపుణ్యాలను నిరూపించే ప్రాజెక్టులు, పోర్ట్‌ఫోలియో, ఇంటర్న్‌షిప్ అనుభవం, ప్రొఫెషనల్ ప్రొఫైల్‌తో బయటకు రావాలి.

**అధ్యాపకుల నాణ్యత లేకుండా విద్యా నాణ్యత సాధ్యం కాదు**

విద్యార్థులపై మాత్రమే నిందలు వేయడం సరికాదు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెరగాలంటే అధ్యాపకుల్లో కూడా బోధనా, పరిశోధనా సామర్థ్యాలు పెరగాలి.సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో అధ్యాపకులకు నిరంతర శిక్షణ అవసరం. పరిశ్రమలతో అనుసంధానం, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, పరిశోధనా సహకారం, ప్రొఫెషనల్ సర్టిఫికేషన్లు, ఆధునిక బోధనా పద్ధతులపై శిక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.ఉపాధ్యాయుడు ఇకపై కేవలం సమాచారాన్ని అందించే వ్యక్తి కాదు. మార్గదర్శకుడు, పరిశోధకుడు, ఫెసిలిటేటర్, సమస్య పరిష్కారానికి దిశానిర్దేశం చేసే వ్యక్తి కావాలి.

అక్రిడిటేషన్, ర్యాంకింగ్స్‌కు కొత్త ప్రమాణాలు అవసరంఇంజనీరింగ్ కళాశాలలను కేవలం భవనాలు, మౌలిక వసతులు, విద్యార్థుల సంఖ్య, పరీక్షా ఫలితాలు లేదా ప్లేస్‌మెంట్ శాతాల ఆధారంగా అంచనా వేయడం సరిపోదు.లెర్నింగ్ ఔట్‌కమ్స్, ఉపాధి సాధికారత, పరిశోధన, ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, పరిశ్రమ అనుసంధానం, సామాజిక ప్రభావం వంటి అంశాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి.కళాశాలలు తమ ప్లేస్‌మెంట్ నాణ్యత, ఇంటర్న్‌షిప్‌లు, సగటు వేతనాలు, ఉన్నత విద్యలో ప్రవేశాలు, స్టార్టప్‌లు, అధ్యాపకుల అర్హతలు, పరిశోధన, విద్యార్థుల ప్రాజెక్టులపై పారదర్శక సమాచారాన్ని అందించాలి.

**ఏఐ ఇంజనీరింగ్ విద్యను మారుస్తుంది.. అంతం చేయదు**

కృత్రిమ మేధస్సు ఇంజనీరింగ్ విద్యకు ఒక పెద్ద సవాలు అయినప్పటికీ, అదే సమయంలో ఒక గొప్ప అవకాశం కూడా.విద్యార్థులు కోడింగ్, పరిశోధన, సిమ్యులేషన్, డిజైన్, డాక్యుమెంటేషన్ వంటి పనుల్లో ఏఐ సాధనాలను మరింతగా ఉపయోగించనున్నారు. వాటిని నిషేధించడం కంటే బాధ్యతాయుతంగా ఉపయోగించే విధానాన్ని బోధించాలి.ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థికి ఏఐ పై ప్రాథమిక అవగాహన ఉండాలి. అదే సమయంలో ఏఐ ఇచ్చే సమాచారం తప్పులేనిదని భావించకూడదు. ఏఐ ఫలితాలను పరిశీలించడం, ధృవీకరించడం, విశ్లేషించడం కూడా ఒక ముఖ్యమైన నైపుణ్యంగా మారాలి.భద్రత, నైతికత, బాధ్యత వంటి అంశాల్లో మానవ నిర్ణయానికి ఉన్న ప్రాధాన్యత ఎప్పటికీ ఉంటుంది.ఏఐ ని ఉపయోగించగల ఇంజనీర్ కంటే, ఏఐ ని అర్థం చేసుకుని, దాని పరిమితులను గుర్తించి, దానితో మెరుగైన పరిష్కారాలను సృష్టించగల ఇంజనీర్లే భవిష్యత్తును నిర్మిస్తారు.

**తెలంగాణలో ఒక సమగ్ర ఇంజనీరింగ్ విద్యా విధానం అవసరం**

తెలంగాణ తన ఇంజనీరింగ్ విద్యను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దే అవకాశం కలిగి ఉంది. ఇందుకోసం కొత్త కళాశాలలు, కొత్త సీట్లు ఏర్పాటు చేయడం కంటే ముందుగా ప్రస్తుత విద్యా వ్యవస్థలో నాణ్యతను పెంచడం అవసరం.బ్రాంచ్‌ల వారీగా విద్యార్థుల డిమాండ్, పరిశ్రమ అవసరాలు, ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ అవసరాలను సమగ్రంగా అధ్యయనం చేయాలి. కోర్ ఇంజనీరింగ్‌ను ఆధునిక సాంకేతికతలతో అనుసంధానించాలి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి. ప్రైవేటు సంస్థల్లో నాణ్యతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలి.పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వం కలిసి పనిచేసే ఇండస్ట్రీ-అకాడెమియా ఎకోసిస్టమ్ నిర్మించాలి.విద్యార్థులను ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి తీసుకెళ్లే విధంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించాలి.

**పరిమాణం నుంచి నాణ్యత వైపు**

ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై జరుగుతున్న చర్చ కేవలం రాజకీయ వాదనగా మిగిలిపోకూడదు. ఇది తెలంగాణ ఇంజనీరింగ్ విద్యా వ్యవస్థపై ఆత్మపరిశీలనకు ఒక అవకాశంగా మారాలి.1.1 లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులను తయారు చేయడం సమస్య కాదు. వారికి తగిన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, ప్రాయోగిక అనుభవం, ఉపాధి అవకాశాలు లేకుండా పట్టభద్రులను తయారు చేయడమే సమస్య. డిగ్రీల సంఖ్య పెరగడం కంటే నైపుణ్యాల నాణ్యత పెరగాలి. సర్టిఫికెట్ల కోసం నడిచే విద్య తగ్గి, సామర్థ్యాల ఆధారిత విద్య పెరగాలి. కేవలం తరగతి గది బోధన తగ్గి, ప్రయోగశాలలు, ప్రాజెక్టులు, పరిశ్రమ అనుభవం, పరిశోధన పెరగాలి.ఇంజనీరింగ్ విద్య ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలకు మాత్రమే విద్యార్థులను సిద్ధం చేయకూడదు. రేపటి సమాజం ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలు చూపగల ఇంజనీర్లను తయారు చేయాలి.బలమైన ప్రాథమిక పరిజ్ఞానం, ప్రాయోగిక నైపుణ్యాలు, డిజిటల్ సామర్థ్యం, సృజనాత్మకత, నైతిక విలువలు, నిరంతర అభ్యాసం కలిసినప్పుడే భవిష్యత్ ఇంజనీర్ రూపుదిద్దుకుంటాడు.అందువల్ల ఇకపై మన ప్రశ్న “మనం ఎంతమంది ఇంజనీర్లను తయారు చేస్తున్నాం?” అనేది కాదు. “భవిష్యత్తు కోసం ఎలాంటి ఇంజనీర్లను తయారు చేస్తున్నాం?” అనేదే అసలు ప్రశ్న. ఈ ప్రశ్నకు తెలంగాణ మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ విద్యా వ్యవస్థ సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

**డా. ముచ్చుకోట సురేష్ బాబు**

# నవ్యావిష్కరణలకు నిధుల కటకట!

**ప్రఖ్యాత ఆర్థికవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత పాల్ రోమర్ స్పష్టీకరించినట్లు- కొత్త వస్తూత్పత్తుల సృష్టికి, దీర్ఘకాలిక ఆర్థిక ప్రగతికి అత్యంత ముఖ్యమైన ముడిసరకులు నవ్యాలోచనలే. వాటిని ప్రోత్సహిస్తూ పరిశోధనలూ ఆవిష్కరణల(ఆర్అండ్‌డీ)పై పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టే దేశాలే ఆధునిక సాంకేతికతల్లో స్వావలంబన సాధించగలవు. నవకల్పనల సాయంతో ఉత్పాదకతలో పురోగతిని నమోదుచేయగలవు. ఈ వాస్తవాన్ని గుర్తించిన కేంద్ర ఆర్థిక సర్వే- దిగుమతులపై ఆధారపడటం తగ్గించి, నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించి పోటీతత్వాన్ని పెంచుకుంటేనే పారిశ్రామిక వృద్ధిలో భారతావని తదుపరి దశలోకి ప్రవేశిస్తుందని విస్పష్టంగా పేర్కొంది. పటిష్ఠ ఆర్థిక స్థిరత్వం, అధిక స్థూలదేశీయోత్పత్తి, మెరుగైన జీవన ప్రమాణాలకూ పరిశోధనలపై చేసే ఖర్చుకూ బలమైన సానుకూల సంబంధం ఉందని స్పష్టీకరించిన నీతిఆయోగ్- ఇండియా తన జీడీపీలో కనీసం 2శాతం సొమ్మును ఆర్అండ్‌డీపై వెచ్చించడం అత్యవసరమని సూచించింది. కానీ, దేశీయంగా ఆ వ్యయం దశాబ్దాలుగా జీడీపీలో ఒక్క శాతంకంటే దిగువకు పరిమితమవుతుండటం- జాతీయ అభివృద్ధి వ్యూహాల అమలులో అతిపెద్ద లోపమవుతోంది!**

కేంద్ర శాస్త్రసాంకేతిక విభాగం(డీఎస్‌టీ) 2024 25లో దేశవ్యాప్తంగా ఉన్న 8వేల పైచిలుకు ఆర్అండ్‌డీ సంస్థలను సర్వే చేసి ఇటీవలే రెండు నివేదికలను విడుదల చేసింది. వాటిని పరిశీలిస్తే, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదగాలనుకుంటున్న భారతావని మిగిలిన ప్రధాన దేశాల కన్నా ఆర్అండ్‌డీలో ఎంతగా వెనకబడిందో అర్థమవుతుంది. 201314లో వైజ్ఞానిక పరిశోధనలకు ఇండియా రూ.79,355 కోట్లను ఖర్చుచేస్తే, 202324 నాటికి అది రూ.2.44 లక్షల కోట్లకు పెరిగింది. కానీ, ఇది జీడీపీలో 0.84శాతం మాత్రమే! డీఎస్‌టీ ప్రచురించిన ‘సైన్స్ అండ్ టెక్నాలజీ ఇండికేటర్స్ టేబుల్స్’ ప్రకారం, 200809లో ఇంతే మొత్తాన్ని ఆర్అండ్‌డీకి వ్యయం చేశాక జీడీపీలో దాని వాటా క్రమంగా పడిపోయింది. అది మళ్లీ 0.84శాతానికి చేరడానికి 15ఏళ్లు పట్టింది! ఇజ్రాయెల్, దక్షిణ కొరియా, జర్మనీ, జపాన్, అమెరికా, చైనా, యూకే, ఫ్రాన్స్ వంటి దేశాలన్నీ మనకంటే ఎన్నో రెట్లు ఎక్కువగా పరిశోధనలకు పెట్టుబడులు సమకూర్చుతున్నాయి. ఆ మేరకు అవి ఆర్థికంగానూ లాభపడుతున్నాయి. అత్యాధునిక రంగాల్లో చైనాతో పోటీలో ఇండియా నెగ్గుకురావాలంటే విజ్ఞాన సంద్ర మథనానికి నిధుల అందుబాటును పెంచితీరాలి!

అయిదేళ్ల నాడు దేశీయ ఆర్అండ్‌డీ వ్యయంలో 54.5శాతంగా ఉన్న ప్రభుత్వాల భాగస్వామ్యం, 202324కు వచ్చేసరికి 48.2శాతానికి తగ్గిపోయింది. అందులోనూ ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చు నామమాత్రంగా ఉండటం విస్మయం కలిగిస్తోంది. 202324లో అన్ని రాష్ట్రాల సర్కార్లు కలిసి ఆర్అండ్‌డీకి కేవలం రూ.9796 కోట్లను మాత్రమే వెచ్చించాయని డీఎస్‌టీ నివేదించింది. ఆ కొద్దిపాటి కేటాయింపుల్లోనూ ఎక్కువ వాటా తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, తెలంగాణ వంటి కొన్ని రాష్ట్రాలదే! ఇలాంటి దుస్థితిలో ఉన్నతస్థాయి పరిశోధనా వసతులకు తప్పని కొరత వల్ల ప్రతిభావంతులైన యువత విదేశాలకు తరలిపోతుండటం దేశానికి నష్టంచేస్తోంది. ఇటీవలి కాలంలో దేశీయంగా రీసెర్చ్ పేపర్లు ఇబ్బడిముబ్బడిగా ప్రచురితమవుతున్నా, వాసిలో చాలావరకు తేలిపోతున్నాయి. కాబట్టి నవతరానికి వైజ్ఞానిక దృక్పథాన్ని అలవరచడం, విశ్వవిద్యాలయాల్లో పరిశోధక సదుపాయాలను విస్తృతపరచడం, ఔత్సాహిక ఆవిష్కర్తలకు తోడుగా ఉండటంలో ప్రభుత్వాలు క్రియాశీలకంగా వ్యవహరించాలి. అప్పుడే ఆర్థిక, సామాజిక ప్రగతికి బాటలువేసే శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఇండియా పురోగమనం వేగం పుంజుకుంటుంది!










- స్వర్ణ గ్రామం- స్వర్ణ వార్డు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- క్షీణిస్తున్న సేవలు
- సర్వేల పేరుతో సిబ్బంది డుమ్మా
- రీ సర్వే పేరుతో కనిపించని సర్వేయర్లు
- సమన్వయ లోపంతో ఎవరికి వారే యమునా తీరే

# సేవలకు దూరం...



**అనంతపురం /సత్యసాయి జిల్లా,**
**ఆగస్టు 16, అనంత జనశక్తి న్యూస్ ;**

ప్రభుత్వ సేవలను ప్రజలకు దగ్గరగా అందించాలన్నదే లక్ష్యంతో ప్రభుత్వాలు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టాయి... సచివాలయ వ్యవస్థ అన్నది గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం.....ప్రతి గ్రామం నుండి ప్రజలు రైతులు ప్రభుత్వ సేవలు కోసం మండల కేంద్రానికి రావాలంటే వారు పడే వేదనలను గుర్తించిన గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సచివాలయ వ్యవస్థను ప్రతి గ్రామాన అమలుపరిచేందుకు నాంది పలికారు. ఇందులో భాగంగా ప్రతి రెవిన్యూ గ్రామంలో సచివాల నూతన భవనాలను నిర్మించి. అందులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ఆయా గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. తద్వారా ప్రభుత్వ సేవలు మారుమూల గ్రామాలలోని ప్రజల ఇంటిముంగిటికే చేరాయి. అయితే వీటి నిర్వహణలో అధికార యంత్రాంగం మొత్తం ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తుండటంతో సంబంధిత సచివాలయ సిబ్బందిపై అజమాయిషిని కోల్పోయారు.

**ఆశయాలకు దూరంగా ...**

సచివాలయ వ్యవస్థను ఏ ఉద్దేశంతో ప్రభుత్వాలు కోట్ల రూపాయలను వ్యయం చేసి గ్రామస్థాయిలో భవనాల నిర్మించారో తెలియదు కానీ ఆ లక్ష సాధనలో పూర్తిగా విఫలమవుతుందన్న విమర్శలు ప్రజల నుండి వ్యక్తమవుతున్నాయి.

యధా రాజా తథా ప్రజా అన్నట్లు ఆయా సచివాలయాల్లో సేవలను పొందేందుకు ప్రజలు ప్రయత్నించిన తిరిగి వారు మండల కేంద్రానికి మాత్రం రాక తప్పడం లేదు. దీంతో సచివాలయాలు వాటి ఆశయాలకు దూరంగా సాగుతున్నాయి అనడంలో అతిశయోక్తి లేదు.

**అర కొరక సేవలు- తప్పని తిప్పలు**

మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపమో, ఉన్నత స్థాయి అధికారుల నిర్లక్ష్యమో తెలియదు కానీ ప్రజలకు అందాల్సిన సేవలు మాత్రం అరకొరకగానే అందుతున్నాయన్న చర్చ సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో చాలా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లకు సరైన సామాగ్రి అందుబాటులో లేకపోవడంతో ప్రజల సేవలు కుంటుపడుతున్నాయని చెప్పవచ్చు. ఆన్లైన్ నమోదుకు వచ్చే ప్రజలకు సరైన సామాగ్రి లేకపోవడం, కంప్యూటర్ సరిగా పని చేయకపోవడంవలన వారికి తిప్పలు తప్పడం లేదు. మరికొన్ని సచివాలయాల్లో ఆన్లైన్ వ్యవస్థ పని చేసిన వాటికి సంబంధించిన నకులు ప్రింట్ తీసేందుకు ప్రింటర్లు పని చేయకపోవడంతో సెల్ ఫోన్లలో త్రిత్రీకరించుకొని ప్రధాన కార్యాలయాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

**కనిపించని సర్వేయర్లు...**

ప్రతి గ్రామంలో భూ సమస్యలు అనేకం ఉత్పన్నమవుతున్నాయి. వాటి కొలతల వేసేందుకు రైతులు చలానాలను చెల్లించినప్పటికీ సర్వేయర్లు అందుబాటులో లేక ఎక్కడికక్కడ రైతుల సమస్యలు అలాగే ఉండిపోయాయి. సర్వేకి ఎప్పుడు వస్తారని రైతులు గట్టిగా ప్రశ్నిస్తే సిబ్బంది అంతా రి సర్వేలో ఉన్నారు నెల రోజులపాటు ఎవరు అందుబాటులోకి రారంటూ సదరు కార్యాలయం సిబ్బంది తెగేసి చెబుతుండడం తీవ్ర చర్చనీయాంశంగా మారుతుంది. దీనివలన చాలా గ్రామాల్లో రైతుల మధ్య చిచ్చు రేగుతోంది.

**యల్లనూరు మండలంలో...**

యల్లనూరు మండలం వ్యాప్తంగా 14 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో చిలమకూరు, మల్లా గుండ్ల సచివాలయాలు అసంపూర్తి నిర్మాణంలో ఉన్నాయి. అలాగే దంతలపల్లి సచివాలయం పూర్తి అయ్యి వాటికి సంబంధించిన బిల్లులను ప్రభుత్వం చెల్లించినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ తన స్థలానికి డబ్బులు చెల్లించాలంటూ కొత్త మెలిక పెట్టి సచివాలయాన్ని వినియోగించుకోకుండా తరచూ సచివాలయానికి తాళాలు వేస్తూ అధికారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇక సచివాలయాల్లోని సిబ్బంది విషయానికొస్తే మధ్యాహ్నం ముడుగంటలు దాటిందంటే ఎవరు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. సచివాలయం నోడల్ అధికారి మినహా ప్రతి ఒక్కరూ వివిధ కారణాలతో కార్యాలయానికి దూరంగా ఉంటున్నారు. ఇక సర్వేయర్ల విషయానికొస్తే భూ సర్వేల పేరుతో వారు సచివాలయాల వైపు గాని కార్యాలయాల వైపు గానీ కన్నెత్తి చూడకపోవడంతో రైతుల పొలాల హద్దులకు సంబందించి కొలతలకు కట్టిన చలానాలు కూడా నిరుపయోగంగా మారుతున్నాయి.

**పుట్లూరు మండలంలో...**

పుట్లూరు మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో కంప్యూటర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో పాటు సచివాలయ సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు . కంప్యూటర్లు తరచూ మొరాయించడం, సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సచివాలయాల్లో ప్రజలు కూర్చునేందుకు అవసరమైన కుర్చీలు, బెంచీలు కూడా అందుబాటులో లేకపోవడంతో సచివాలయాలకు వచ్చే వృద్ధులు, మహిళలు, ఇతర ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు.
ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు సచివాలయాల్లో పనిచేయని కంప్యూటర్లను వెంటనే మరమ్మతులు చేయించడంతో పాటు అవసరమైన కొత్త కంప్యూటర్ పరికరాలను ఏర్పాటు చేయాలని, అలాగే ప్రజలకు సరిపడా కుర్చీలు, బెంచీలు అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీ సత్య సాయి జిల్లా


**తలుపుల మండలంలో.......**

మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో కంప్యూటర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో పాటు సచివాలయ సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు . కంప్యూటర్లు తరచూ మొరాయించడం, సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సచివాలయాల్లో ప్రజలు కూర్చునేందుకు అవసరమైన కుర్చీలు, బెంచీలు కూడా అందుబాటులో లేకపోవడంతో సచివాలయాలకు వచ్చే వృద్ధులు, మహిళలు, ఇతర ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు సచివాలయాల్లో పని చేయని కంప్యూటర్లను వెంటనే మరమ్మతులు చేయించడంతో పాటు అవసరమైన కొత్త కంప్యూటర్ పరికరాలను ఏర్పాటు చేయాలని, అలాగే ప్రజలకు సరిపడా కుర్చీలు, బెంచీలు అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వంలో కొన్ని నూతన సచివాలయాలు పూర్తిచేసిన సిబ్బంది మాత్రం పాత సచివాలయాల్లోనే పబ్బం గడుపుతున్నారు. మరి అన్ని లక్షలు ఖర్చుపెట్టి నూతన సచివాలయాలు పాడుబడ్డ భవనాలుగా దర్శనమిస్తున్నాయి. మేజర్ పంచాయతీలోనే ఇలా ఉంటే మరి గ్రామాలలో ఎలాంటి పరిస్థితి నెలకొన్నదో ఊహించలేమని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కొన్ని సచివాలయాలు మందుబాబులకు నిలయంగా మారాయి. అంతేకాకుండా గత ప్రభుత్వంలో సచివాలయాలు గా రూపు దిద్దుకుంటే కోటమ్మ ప్రభుత్వంలో స్వర్ణ గ్రామంస్వర్ణ వార్డుగా పేరును మార్చిన ఏ సచివాలయానికి కూడా ఈ పేరును చిత్రీకరించలేదు. కొన్ని సచివాలయాలలో ఇచ్చిన పరికరాలు నిర్వహణ లేకపోవడంతో మూలక పడిపోయాయి.



### సర్వేల పేరుతో డుమ్మాలు...


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సర్వేలను చేపట్టింది. భవిష్యత్తులో ప్రజలకు ఎటువంటి సేవలు అందించాలన్న దానిపై పలు రకాల సర్వేలను నిర్వహించడం జరుగుతోంది. అయితే ఈ సర్వేలకు కొందరి సిబ్బందిని మాత్రమే విధులకు కేటాయించగా చాలామంది సిబ్బంది సచివాలయాల వైపు చూడకుండా వారి వ్యక్తిగత పనులను చక్కదిద్దుకునే పనిలో నిమగ్నమయ్యారన్న వాదనలు వినిపిస్తున్నాయి. సచివాలయాల్లో ఉన్న ఒకరు ఇద్దరు సిబ్బందిని అడిగితే సర్వేకి వెళ్లారంటూ అబద్ధపు సమాచారంతో ప్రజలను మభ్యపెడుతూ వస్తున్నారు. ఇటీవల సర్ కార్యక్రమాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాయి వీటి కోసం బిఎల్ఓ లను ఎంపిక చేయగా వారికి సాయ సహకారాలు అందించేందుకు సచివాలయంలోని మరో సిబ్బందిని జతపరిచారు. మిగిలిన వారు కూడా అదే పేరు చెబుతూ విధులకు డుమ్మా కొడుతున్నారు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



### నల్లచెరువు మండలంలో...... పనులు పూర్తి అయినా ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయాలు

**నల్లచెరువు మండల పరిధిలో మొత్తము 10 గ్రామ సచివాలయాలు కలవు అందులో ఉభిచెర్ల గ్రామ సచివాలయం మాత్రం మొత్తం పనులు పూర్తి అయినా కూడా ప్రారంభానికి నోచుకోకుండానే ఉంది అందుకు గల కారణాలు గ్రామ సచివాలయం మరియు రైతు భరోసా కేంద్రం మరియు హెల్త్ సెంటర్ మూడింటినీ ఒకేచోట ఒక్కడే కాంట్రాక్టర్ నిర్మించి పనులు పూర్తి చేసాడు కానీ అధికారులు ఫైనల్ బిల్లు చేయకుండా అతనికి అమౌంట్ చెల్లించలేదని అందుకే హ్యాండవర్ చేయకుండా అధికారులకు తాళాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని ప్రజలు నుండి వినికిడి అక్కడికొచ్చే మహిళా సిబ్బందికైతే మరీ ఇబ్బంది కరంగా ఉందని ఆ పాత సచివాలయంలో టాయిలెట్స్ కూడా సరిగ్గా లేకపోవడంతో వారి బాధ ఎవరికీ చెప్పకోలేనంత ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కొత్త బిల్డింగ్ ఎంత తొందరగా అధికారులకు హ్యాండవర్ చేస్తే అంత ప్రజలకు సేవ చేసేకి అనుకులంగా ఉంటుందని సిబ్బంది వాపోతున్నారు,ఇకపోతే తలమర్ల వాండ్లపల్లి పంచాయతీ కి సంబందించిన సచివాలయంలో టాయిలెట్స్ పనులు పెండింగ్ లో ఉన్నందున ప్రారంబానికి నోచుకోకుండా పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే సిబ్బంది విధులు కొనసాగించే పరిస్థితిలో ఉన్నారు.ఈ సమస్యలన్నీ పరిస్కారం కావాలంటే జిల్లా స్థాయిలో అధికారులు పరిశీలించి అటు సిబ్బందికి ఇటు ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేసి సచివాలయాలు ప్రాంబానికి సహకరించాలని ప్రజలు కోరుతున్నాను.**







## కూటమి ప్రభుత్వంలో పల్లె సీమలకు
# మహర్దశ..సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్

**- మంత్రి కందుల దుర్గేష్**

**నిడదవోలు ఆగస్టు 16 అనంత జనశక్తి న్యూస్**

నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు అగ్రహారం గ్రామం నందు రూ.20 లక్షల ఎంపీలాడ్స్ నిధులతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ మరియు కానూరు గ్రామంలో రూ.17 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన జెడ్పీ హైస్కూల్ కాంపౌండ్ వాల్ ను ఎంపీ పురందేశ్వరీ, మంత్రి కందుల దుర్గేష్, స్కిల్ డెవలప్ మెంట్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు లు ఘనంగా ప్రారంభించారు.**రూ.4.40 కోట్లతో కానూరు అగ్రహారం అభివృద్ధి**
ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గత రెండేళ్ల కాలంలో కానూరు అగ్రహారంలో రూ.4.40 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఎంపీలాడ్స్ నిధులు మంజూరు చేసిన ఎంపీ పురందేశ్వరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో ఆరేడు ప్రాంతాల్లో ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టగా, మొదటి హాల్‌ను ఇక్కడ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధిలో భాగంగా పంచాయతీ రాజ్ ద్వారా పల్లె పండుగ 1.0 లో రూ.15 కోట్లతో హౌసింగ్ కాలనీలో సీసీ రోడ్లు, పల్లె పండుగ 2.0 లో రూ.35.45 లక్షలతో గోదావరి కట్టని ఊరుతో అనుసంధానం చేసే 6 రహదారి పనులు చేపట్టామన్నారు. రూ.73 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో సురక్షిత త్రాగునీరు కల్పన, రూ.30 లక్షల డీఎంఎఫ్ నిధులతో సీసీ డ్రెయిన్ నిర్మాణం, రూ.20 లక్షల ఎంపీలాడ్స్ నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, రూ. 36 లక్షల జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ నిధులతో హెల్త్ సెంటర్ భవనం నిర్మాణం, రూ.23.04 లక్షల మండల ప్రజా పరిషత్ నిధులు, రూ.19.93 లక్షల పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.8.90 లక్షలతో 4 గోకులం షెడ్లు, రూ.14.83 లక్షల విలువైన 39 సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అందించడమైందన్నారు.రూ.1.64 కోట్ల శాస్కి నిధులతో మెయిన్ రోడ్డు నుండి రహదారి నిర్మాణం చేపడతామన్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లకు కూటమి ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రూ.27 కోట్లతో డి.ముప్పవరం నుండి కాపవరం వరకు రోడ్డు నిధులపై సీఎం సానుకూలంగా స్పందించారని, అలాగే విజ్జేశ్వరం నుండి సిద్ధాంతం వరకు ఏటిగట్టు రహదారి పటిష్ఠతకు ఇప్పటికే సీఎం, డిప్యూటీ సీఎంలకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.రాబోయే గోదావరి పుష్కరాల నాటికి గోదావరి తీరంలోని ఘాట్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజాదరణ పొందుతోందన్నారు. త్వరలోనే నూతన పించన్లు, ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించనుందని తెలిపారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**రెండేళ్లలో రూ.8.18 కోట్లతో కానూరు గ్రామం అభివృద్ధి**

రెండేళ్లలో రూ.8.18 కోట్లతో కానూరు గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రూ.69.90 లక్షలతో పల్లెపండుగ 1.0 క్రింద 6 పనులు, రూ. 57 లక్షలతో పల్లెపండుగ 2.0 క్రింద 4 పనులు, రూ.5 లక్షల పంచాయితీ నిధులు, రూ.26.81 లక్షల ఎంపీపీ నిధులు, రూ.13.00 లక్షల జిల్లా పరిషత్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రూ.2.08 కోట్ల జల్ జీవన్ మిషన్ నిధులతో రెట్రోఫిట్టింగ్ క్రింద ఇంటింటికి కుళాయిలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రూ.30 లక్షల డీఎంఎఫ్ నిధులతో సీసీడ్రెయిన్లను నిర్మించామన్నారు. రూ. 3.60 లక్షలతో 2 గోకులం షెడ్లను, రూ.1.50 కోట్ల నాబార్డు నిధులతో కానూరు నుండి నడుపల్లి కోట వరకు రహదారి నిర్మించామన్నారు. అదే విధంగా రూ.4.34 కోట్ల శాస్కి నిధులతో కానూరు నుండి కోరుపల్లి వరకు, కానూరు నుండి ఏసులుమర్రుపాడు వరకు రహదారిని నిర్మిస్తామన్నారు. రూ.17.50 లక్షల ఎంపీలాడ్స్ నిధులతో జెడ్పీ హైస్కూల్ కాంపౌండ్ వాల్ ను నిర్మించామన్నారు. రూ.9 లక్షల నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో గ్రామంలో హెల్త్ సెంటర్ భవనం అభివృద్ధికి కృషి చేస్తున్నామని, రూ.13.81 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను 36 మంది లబ్ధిదారులకు అందించినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.





# ప్రియాంక కేసు దర్యాప్తు అధికారిగా ఐపీఎస్ పాటిల్ దేవరాజ్

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ

**అమరావతి, అనంత జనశక్తి న్యూస్**

మద్యం మత్తులో యువకులు కారు ఢీ కొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి మరణించిన వైద్య విద్యార్థి ప్రియాంక కేసు దర్యాప్తు అధికారిగా పాటిల్ దేవరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీగా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఈ కేసులో ఆయనకు సహకరించాలని రాజమండ్రి సౌత్ జోన్ డీఎస్పీ శివ ప్రియ, ప్రకాష్ నగర్ పోలీస్ సీఐ బాజీలాల్‌లను ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ కేసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి.. నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ఆ ఆదేశాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఆగస్టు 3వ తేదీన రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ వద్ద మద్యం మత్తులో కారు నడిపి.. స్కూటిని పలు మార్లు ఢీ కొట్టారు. ఈ ఘటనలో వాహనంపై ఉన్న పీజీ విద్యార్థిని ప్రియాంక కిందపడిపోయింది. ఆమెను కారుతో ఢీ కొట్టారు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి.. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి అరెస్ట్ చేశారు. అయితే ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రియాంక పరిస్థితి విషమంగా మారింది. దీంతో మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్‌కు ఆమెను తరలించారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆగస్టు 9వ తేదీన మరణించింది. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో ఈ ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది.

# అత్యవసర సేవలు బంద్



- జూనియర్ డాక్టర్ల కీలక నిర్ణయం
- నేటి నుంచి నిరసన ఉధృతం
- స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ
- విధులు బహిష్కరిస్తున్న జూనియర్ డాక్టర్లు

**అమరావతి, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో తమ స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా విధులు బహిష్కరిస్తున్న జూనియర్ డాక్టర్లు, సోమవారం నుంచి అత్యవసర సేవలను కూడా నిలిపివేసేందుకు నిర్ణయించడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సమ్మె నివారణపై ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక శాఖతో చర్చించి తదుపరి నిర్ణయం వెలువరిస్తామని జూడాలకు స్పష్టం చేసింది.

అయితే వారు సమ్మె విరమించేందుకు సిద్ధపడకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలకు వైద్య ఆరోగ్య శాఖ సన్నాహాలు పూర్తి చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఎలాంటి వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూసేందుకు వైద్యులందరి అన్ని రకాల సెలవులను రద్దు చేస్తూ వైద్య విద్య సంచాలకులు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.

పరిస్థితిని ధీటుగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ సెకండరీ ఆసుపత్రులు, జిల్లా వ్యాప్త వైద్య సిబ్బందితో పాటు ఇన్ సర్వీస్ పీజీలు, ప్రైవేటు మెడికల్ కాలేజీలకు చెందిన పీజీ వైద్యుల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అత్యవసర విభాగాలు, క్యాజువాల్టీ, ఐసీయూ, కీలక ఆపరేషన్లు, ప్రసవాలు. ఇతర నిరంతర చికిత్సలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగిపోకుండా ముందస్తుగా ప్రత్యేక బృందాలను సిద్ధం చేసింది. ప్రభుత్వ వైఖరితో రోగులకు కలుగుతున్న ఇబ్బందులను తగ్గించడమే లక్ష్యంగా అన్ని స్థాయిల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కట్టుదిట్టం చేసారు.

# ఎయిర్‌పోర్టులో కాల్పుల కలకలం

- లైసెన్స్‌డ్ పిస్టల్ పేలడంతో..
- ఇద్దరు సిబ్బందికి గాయాలు

**అమరావతి, అనంత జనశక్తి న్యూస్**

వారణాసి లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం భద్రతా తనిఖీల సమయంలో కాల్పులు కలకలం రేపాయి. ముంబై వెళ్లాల్సిన ఓ ప్రయాణికుడి వద్ద ఉన్న లైసెన్స్‌డ్ తుపాకీ నుంచి రౌండ్ పేలడంతో ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. విమానాశ్రయానికి వచ్చిన ప్రయాణికుడు తన వద్ద ఉన్న లైసెన్స్‌డ్ ఆయుధాన్ని నిబంధనల ప్రకారం తనిఖీకి సమర్పించాడు. ఈ సమయంలో ఆయుధాన్ని పరిశీలిస్తుండగా అనుకోకుండా తుపాకీ నుంచి ఓ రౌండ్ పేలినట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ప్రయాణికుడు తన భార్యతో కలిసి ముంబై వెళ్లే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం IX1810 ఎక్కేందుకు విమానాశ్రయానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

కాల్పుల ఘటనలో ఇద్దరు AAICLAS భద్రతా స్క్రీనర్లు గాయపడ్డారు. వారిని వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఒక ఉద్యోగికి బుల్లెట్ తగలగా, మరో ఉద్యోగికి గాయాలు అయినట్లు సమాచారం. ఘటన అనంతరం విమానాశ్రయంలో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. కాల్పులు జరిగిన వెంటనే భద్రతా సంస్థలు సంబంధిత ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారించడం ప్రారంభించాయి. తుపాకీ విమానాశ్రయానికి ఎలా తీసుకువచ్చారు, ఆయుధ తనిఖీ సమయంలో భద్రతా ప్రోటోకాల్‌లు ఎలా అమలయ్యాయి అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఆయుధాన్ని తనిఖీ చేసే సమయంలో నిర్దేశిత భద్రతా విధానాలు పాటించబడ్డాయా లేదా అనే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

విమాన ప్రయాణాల్లో లైసెన్స్‌డ్ ఆయుధాలను తీసుకెళ్లేందుకు ప్రత్యేక నిబంధనలు ఉంటాయి. ఆయుధాలను ప్రయాణికులు సాధారణంగా తమ వద్ద ఉంచకుండా నిర్దేశిత విధానంలో తనిఖీ చేసి, సురక్షితంగా విమానంలో తరలించాల్సి ఉంటుంది. వారణాసి విమానాశ్రయంలో జరిగిన ఈ ఘటన నేపథ్యంలో ఆయుధాల తనిఖీ, వాటి నిర్వహణ, భద్రతా సిబ్బంది అనుసరించే ప్రోటోకాల్స్‌పై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. ప్రస్తుతం ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, కాల్పులు ఏ పరిస్థితుల్లో జరిగాయనే అంశంపై దర్యాప్తు కొనసాగుతోంది.

# మాజీ డిప్యూటీ స్పీకర్ ఆత్మహత్య..!

- పార్టీ ఆఫీస్‌లో ఉరేసుకొని బలవన్మరణం
- బీర్భూమ్ జిల్లా రాంపూర్‌హాట్‌లో
- టీఎంసీ సీనియర్ నేత ఆశిష్ బెనర్జీ

**కోల్‌కతా, అనంత జనశక్తి న్యూస్**





పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ అనుమానాస్పద మృతిలో మృతి చెందటం కలకలం రేపుతోంది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన పార్టీ కార్యాలయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆయన మరణవార్తతో పార్టీ శ్రేణుల్లో తీవ్ర విషాదం నెలకొంది. బీర్భూమ్ జిల్లా రాంపూర్‌హాట్‌లోని తన నివాసానికి సమీపంలో ఉన్న టీఎంసీ కార్యాలయంలో ఆశిష్ బెనర్జీ మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే పార్టీ కార్యాలయానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

ఘటనాస్థలంలో ఓ సూసైడ్ నోట్ లభించినట్లు పోలీసు వర్గాల నుంచి సమాచారం. అయితే ఆ నోట్‌లో ఏముందనే విషయాన్ని అధికారులు ఇంకా వెల్లడించలేదు. ఆశిష్ బెనర్జీ మృతికి ఖచ్చితమైన కారణం ఏమిటనేది ఇంకా స్పష్టంగా తెలియలేదని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాలు, ఘటనాస్థలంలో లభించిన ఇతర ఆధారాలను పరిశీలించిన తర్వాత మరణానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఆశిష్ బెనర్జీ పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సుదీర్ఘకాలం కీలక పాత్ర పోషించారు. రాంపూర్‌హాట్ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తృణమూల్ కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా కొనసాగిన ఆయన ముఖ్యమంత్రి మమతా బెనర్జీమంత్రివర్గంలో విద్య, వ్యవసాయ శాఖలకు మంత్రిగా పనిచేశారు. అనంతరం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఒక సీనియర్ నేత పార్టీ కార్యాలయంలోనే మృతి చెందడం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. ఘటనపై పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆయనతో సుదీర్ఘంగా రాజకీయ అనుబంధం ఉన్న నాయకులు, స్థానిక కార్యకర్తలు రాంపూర్‌హాట్‌లోని పార్టీ కార్యాలయానికి చేరుకుంటున్నారు.

మరోవైపు పోలీసులు ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఆశిష్ బెనర్జీ చివరిసారిగా ఎవరిని కలిశారు? పార్టీ కార్యాలయానికి ఎప్పుడు వెళ్లారు? ఆయనతో ఎవరైనా ఉన్నారా? సూసైడ్ నోట్‌లో ఏమైనా కీలక సమాచారం ఉందా? అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను కూడా పరిశీలిస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు స్పష్టం చేశారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు, దర్యాప్తులో వెలుగులోకి వచ్చే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

# మిస్టర్ 10%.. జావేద్ అక్తర్ స్ట్రాంగ్ కౌంటర్

- పాకిస్థాన్‌లోని హిందూ మైనార్టీలపై..
- అసిఫ్ అలీ జర్దారీ వ్యాఖ్యలపై ఫైర్

**అమరావతి, అనంత జనశక్తి న్యూస్**



పాకిస్థాన్‌లోని హిందూ మైనార్టీలను ఉద్దేశించి ఆ దేశ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ రచయిత జావేద్ అక్తర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో జర్దారీ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా కావడంతో వివాదం మొదలైంది. ఆ వీడియోలో జర్దారీ మాట్లాడుతూ.. తమ దేశంలో 3 నుంచి 4 శాతం ఉన్న హిందూ జనాభాను ముస్లిం మెజారిటీ సమాజం భరిస్తోందని వ్యాఖ్యానించారు.

''భారతీయులకు వేరే ఆలోచన ఉంది. వారి స్వంత అజెండా వారికుంది.. వారు 'అఖండ భారత్'ను నమ్ముతారు. కానీ దాని మధ్యలో ఉన్న అనేక విషయాలను వారు మర్చిపోయారు'' అని జర్దారీ పేర్కొన్నారు. ''మేము ముస్లింలం. వారు కాదు. కానీ పాకిస్థాన్‌లో ఉన్న 34 శాతం హిందూ జనాభాను భరించే రకానికి చెందిన ముస్లింలం మేము.. వారు ఎక్కడైనా ఎంత స్వేచ్ఛగా, సంతోషంగా ఉంటారో ఇక్కడ కూడా అంతే స్వేచ్ఛగా ఉన్నారు. భారత్‌లో ఉండటం కంటే మనతో ఉండటానికే వారు ఎక్కువ మొగ్గు చూపుతారు'' అని జర్దారీ తన ప్రసంగంలో వ్యాఖ్యానించారు.

ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించిన జావేద్ అక్తర్.. గతంలో అవినీతి ఆరోపణలతో జర్దారీకి వచ్చిన 'మిస్టర్ 10 పర్సెంట్' అనే పేరును ప్రస్తావిస్తూ ఆయనపై ఘాటుగా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ''బెనజీర్ భుట్టోను పెళ్లి చేసుకున్న తర్వాత వెలుగులోకి వచ్చిన పాకిస్థాన్‌కు చెందిన మిస్టర్ జర్దారీ తమ దేశంలో ఉన్న 34 శాతం హిందూ జనాభాను తాము సహిస్తున్నామని అంటున్నారు.. జర్దారీ మీకు 10 శాతం కంటే తక్కువ ఉన్నదేనిపైనా ఎప్పుడూ పట్టింపు లేదని నాకు అర్థమైంది'' అని అక్తర్ ఎద్దేవా చేశారు.

పాకిస్థాన్ విధానాలు, ద్వైపాక్షిక సంబంధాల్లో దాని ధోరణిని జావేద్ అక్తర్ గతంలో కూడా పలుమార్లు నిలదీశారు. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, ఉగ్రవాదులకు తమ భూభాగాన్ని సురక్షిత స్థావరంగా మార్చినందుకు గత ఏడాది మే నెలలో ముంబయిలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కూడా ఆయన పాకిస్థాన్‌ను తీవ్రంగా తప్పుపట్టారు.

''పాకిస్థాన్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి భారత్ ఎల్లప్పుడూ నిజాయితీగా ప్రయత్నించింది. మేము పాకిస్థాన్ కళాకారులకు సాంస్కృతిక మార్గాలను తెరిచాం... కానీ ఒక చేత్తో చప్పట్లు కొట్టలే కదా.. సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి పాకిస్థాన్ ఎప్పుడూ సరైన ప్రయత్నాలు చేయలేదు' అని జమ్మూ కశ్మీర్ అంశాన్ని ఉదాహరణగా చూపుతూ అక్తర్ వ్యాఖ్యానించారు.

కాగా, మార్చి 2024లో జర్దారీ పాకిస్థాన్ 14వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఫిబ్రవరి 2024లో జరిగిన సాధారణ ఎన్నికలు రిగ్గింగ్ ఆరోపణల నడుమ అనిశ్చితిగా ముగియడంతో పాకిస్థాన్ ముస్లిం లీగ్‌నవాజ్ , జర్దారీకి చెందిన పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.

# శ్రావణమాసం ఎఫెక్ట్ దిగొచ్చిన చికెన్ ధరలు

- పది రోజుల క్రితం కిలో రూ.300 వరకు
- ప్రస్తుతం రూ. 230-రూ. 240కి
- చికెన్ బాటలోనే గుడ్లు కూడా..

**అమరావతి, అనంత జనశక్తి న్యూస్**



పవిత్ర శ్రావణమాసం రాకతో తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో చికెన్ మార్కెట్ గ్రాఫ్ మారిపోతోంది. పూజలు, వ్రతాలు, ఆధ్యాత్మిక నియమాల కారణంగా చాలా మంది ప్రజలు మాంసాహారానికి దూరంగా ఉంటుండటంతో చికెన్‌కు డిమాండ్ తీవ్రంగా పడిపోయింది. దీని ప్రభావం ధరలపై స్పష్టంగా కనిపిస్తోంది.

కేవలం 10 రోజుల క్రితం వరకు చుక్కలు చూపించిన చికెన్ ధరలు ఇప్పుడు ఒకేసారి దిగివచ్చాయి. పది రోజుల కిందటి వరకు రెండు రాష్ట్రాల్లోనూ స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.280 నుంచి రూ.300 (కొన్ని ప్రాంతాల్లో రూ.310 దాకా) విక్రయించారు. అయితే శ్రావణమాస నియమాలు ప్రారంభం కావడంతో వినియోగం తగ్గి, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా కిలో చికెన్ ధర రూ.230 నుంచి రూ.240 పరిధిలోనే లభిస్తోంది.

తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, ప్రాంతాల వారీగా మార్కెట్ పరిస్థితిని పరిశీలిస్తే.... ఏపీలోని విజయవాడ, గుంటూరు, అనకాపల్లి, వైజాగ్ తదితర ప్రాంతాల్లో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.220 నుంచి రూ.240 వద్ద కొనసాగుతోంది. ఇక తెలంగాణలోని హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ ప్రాంతాల్లోనూ కాస్త అటుఇటుగా ఇదే రేట్లు అమలవుతున్నాయి.

హైదరాబాద్ పరిసరాల్లో స్కిన్‌లెస్ చికెన్ రూ. 240 నుంచి రూ.250 వరకు ఉండగా, లైవ్ కోళ్ల ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. డిమాండ్ పడిపోవడంతో విక్రయాలు ఆశించిన స్థాయిలో సాగడం లేదని, ఉదయం నుంచి సాయంత్రం వరకు షాపుల వద్ద గిరాకీ చాలా తక్కువగా ఉంటోందని చికెన్ వ్యాపారులు చెబుతున్నారు.

మరోవైపు....శ్రావణమాసంలోనూ నాన్‌వెజ్ తినే కొద్దిమంది ప్రియులకు, ఇతర సమయాల్లో నియమాలు పాటించేవారికి మాత్రం ఈ ధరల తగ్గుదల ఊరటనిస్తోంది. రాబోయే కొన్ని వారాల పాటు ఇదే శ్రావణ వాతావరణం కొనసాగనుండటంతో చికెన్ ధరలు మరికొన్ని రోజుల పాటు ఇలాగే తక్కువగా ఉండే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# దేశ ప్రజలు మీ పాపాలను క్షమించరు

- సోనియాగాంధీపై అమిత్ షా ఫైర్
- దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- వందేమాతరం అంశంపై అమిత్ షా ఫైర్
- కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం..
- జాతీయ గీతాన్ని విస్మరించిందని ఆరోపణ
- సోనియా చేసిన పనిని దేశం మొత్తం చూసింది

**అమరావతి, అనంత జనశక్తి న్యూస్**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ టార్గెట్‌గా తీవ్ర విమర్శలు చేశారు. రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్ ఓ బహిరంగ కార్యక్రమంలో మాట్లాడిన అమిత్ షా.. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో 'వందేమాతరం' గీతం ఆలపిస్తుండగా సోనియాగాంధీ పాట ఆపమని కోరారని అన్నారు. ఈ పాపానికి దేశ ప్రజలు సోనియాగాంధీని ఎన్నటిక క్షమించరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 80 ఏళ్ల తర్వాత కూడా బంకింబాబు రచించిన ఈ అమర గీతానికి మళ్లీ గౌరవం లభిస్తుంటే, అది సోనియాగాంధీకి నచ్చడం లేదని అన్నారు. సోనియా గాంధీ చేసిన పనిని 140 కోట్ల మంది ప్రజలు చూశారని, ఈ పాపానికి ఈ దేశ ప్రజలు మిమ్మల్ని ఎన్నటికీ క్షమించరని అన్నారు.

**"వందేమాతరాన్ని అసంపూర్తిగా వదిలేయాలని ఎవరైనా ఎలా కలగంటారు? కాంగ్రెస్ వాళ్లు సిగ్గుపడాలి వారిలో ఇంకా ఏమైనా సిగ్గు మిగిలి ఉంటే, బంకిం బాబు అమరాత్మకు, దేశ ప్రజలకు చేతులు జోడించి క్షమాపణ చెప్పాలి" అని అన్నారు. ఓటు బ్యాంక్ దురాశతో కాంగ్రెస్ వందేమాతరాన్ని మరిచిపోయిందని అమిత్ షా అన్నారు. ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోడీ ఈ గీతానికి పునర్జీవం పోశారని అన్నారు. ఆదివారం, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా, అమిత్ షా రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మతో కలిసి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు.**

# అర్బన్ నక్సల్ తర్వాత దిమాగీ నక్సల్

- మోదీపై సీపీఎం ఆరోపణలు
- జంతర్ మంతర్ నిరసనకారుల్ని..
- టార్గెట్ చేశారని సీపీఎం చీఫ్ ఎంఏ బేబీ

**అమరావతి, అనంత జనశక్తి న్యూస్**

ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఉపయోగించిన "దిమాగీ నక్సల్" పదంపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. ఈ పదాన్ని ఉపయోగించడంపై సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ స్పందించారు. ఈ పదాన్ని ప్రభుత్వాన్ని విమర్శించే వారిని, జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టే వారిని ఉద్దేశించి చేశారని ఆయన అన్నారు. గతంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను విమర్శించే వారిని 'అర్బన్ నక్సల్స్'గా ముద్ర వేశారని, ఇప్పుడు ఇదే తరహాలో 'దిమాగీ నక్సల్స్' అనే కొత్త పదాన్ని తీసుకువచ్చారని బేబీ అన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ మాట్లాడుతూ, 'దిమాగీ నక్సల్స్' అనే పదాన్ని వాడారు. డవుల్లో ఆయుధాలు పట్టుకున్న నక్సలిజం దాదాపు అంతమయ్యే దశలో ఉన్నప్పటికీ, "దిమాగీ నక్సల్" భావజాలం ఉన్నవారు హింస, అశాంతికి అవకాశాల కోసం చూస్తున్నారని అన్నారు. ఇలాంటి మావోయిస్టు భావజాలం ఉన్న వారిని గుర్తించి, ఏకాకుల్ని చేయాలని పిలుపునిచ్చారు.

మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నక్సలిజాన్ని అంతం చేశామని చెబుతున్న విధానంపై బేబీ ప్రశ్నలు లేవనెత్తారు. యువకులు, యువతను పట్టుకుని న్యాయప్రక్రియ ముందు నిలబెట్టే బదులుగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదమని అభివర్ణించారు. వామపక్షాలు నక్సలిజాన్ని ఎప్పుడూ సమర్థించలేదని బేబీ స్పష్టం చేశారు.

**ఇదిలా ఉంటే, దిమాగీ నక్సల్స్ ఇప్పుడు రాజకీయ రచ్చకు దారి తీసింది. ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యపై కాంగ్రెస్, సీపీఐ, సమాజ్‌వాదీ తదితర ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ.. మోదీ గతంలో తన రాజకీయ ప్రత్యర్థులను "అర్బన్ నక్సల్స్" అని పిలిచారని, ఇప్పుడు "దిమాగీ నక్సల్స్" అంటున్నారని విమర్శించారు. ఇది ప్రధాని నిరాశకు సంకేతమని అన్నారు.**

సోమవారం | రంగారెడ్డి
17.08.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# మీ బాయ్ ఫ్రెండ్‌కు ఇలాంటి అలవాట్లు ఉంటే వెంటనే వదిలేయండి, అతనితో జీవించడం కష్టం



ఇప్పుడు ప్రేమ పెళ్లిళ్లు చేసుకునే వారి సంఖ్య పెరిగిపోయింది. మొదట బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్ గా మొదలైన ప్రయాణం తర్వాత ప్రేమికులుగా.. ఆ తర్వాత భార్యాభర్తలుగా మారుతుంది. అయితే ఒక సంబంధాన్ని పెళ్లి వరకు తీసుకువెళ్లాలంటే ఎదుటి వ్యక్తిలో కొన్ని రకాల గుణాలు ఉండాలి. అలాగే కొన్ని రకాల అలవాట్లు ఉండకూడదు. మీ భాగస్వామిలో ఎలాంటి అలవాట్లు ఉంటే ప్రమాదమో తెలుసుకోండి.



## మీ స్వేచ్ఛను అడ్డుకోకూడదు

మీరు చేసే మంచి పనులకు అతని తోడు ఎప్పుడూ అవసరం. మీరు బయటకు వెళ్లాలని ప్రయత్నించినప్పుడు లేదా ఫోన్‌తో ఎవరితోనైనా మాట్లాడుతున్నప్పుడు, స్నేహితుల్ని కలవడానికి వెళుతున్నప్పుడు... అతడు పదేపదే అడ్డుకుంటే అది మంచి సంకేతం కాదు. అతను మిమ్మల్ని జీవితాంతం స్వేచ్ఛగా వదిలిపెట్టడని అర్థం. స్వేచ్ఛ లేని జీవితాన్ని గడపడం చాలా కష్టం. మీ మీద నమ్మకం ఉన్న వ్యక్తి మీరు ఎక్కడికి వెళ్ళినా అంగీకరించాలి. ఫోన్లో అందరితో మాట్లాడేందుకు ఒప్పుకోవాలి. అలా చేయడం లేదంటే అతడిలో విషపు గుణాలు ఉన్నాయని అర్థం చేసుకోండి.



## నియంత్రించే వ్యక్తి వద్దు

మీ బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్ నిత్యం మిమ్మల్ని నియంత్రించడానికి ప్రయత్నిస్తూ ఉంటే వారితో జీవితం కష్టంగా మారుతుంది. ఆమె లేదా అతడు ప్రేమతోనే మిమ్మల్ని నియంత్రిస్తున్నా కూడా జీవితాంతం భరించడం చాలా కష్టం. మీ కోరికలు మీ ఇష్టాల ప్రకారం జీవితాన్ని జీవించే అవకాశాన్ని వాళ్ళు మీకు ఇవ్వరు. కొన్నాళ్లకు మీ మధ్య బంధం కూడా వీగిపోతుంది. పెళ్లయ్యాక విడాకులు తీసుకునే బదులు బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్ గా ఉన్నప్పుడే విడిపోవడం మీ కుటుంబాలకు మంచిది.




## తక్కువ చేసి మాట్లాడే వ్యక్తి

మీ భాగస్వామి అతని స్నేహితుల ముందు కుటుంబ సభ్యుల ముందు మీకు ఎక్కువ విలువను ఇవ్వాలి. మీ భావోద్వేగాలను అర్థం చేసుకోవాలి.. కానీ అందరి ముందు మిమ్మల్ని ఎగతాళి చేసినట్టు మాట్లాడుతున్నా, మీ ఇష్టాలను తక్కువ చేస్తున్నా, మీ భావోద్వేగాలకు విలువ లేనట్టు మాట్లాడుతున్నా... ఆ వ్యక్తితో జీవితం చాలా కష్టం. అలాంటి వ్యక్తి విషపూరిత భాగస్వామి అని అర్థం చేసుకోండి. అలాంటి భాగస్వామితో సంబంధం లో ఉండడం ఎప్పటికైనా ప్రమాదకరమే.

పైన చెప్పిన లక్షణాలు ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకోవడం రెండు కుటుంబాలకు ఇబ్బందిని కలిగిస్తుంది. ముఖ్యంగా మీరు జీవితాన్నే కోల్పోవాల్సి రావచ్చు. కాబట్టి ఇక్కడ చెప్పిన లక్షణాలున్న బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్ మీకు ఉంటే వీలైనంతవరకు బ్రేకప్ చెప్పుకొని ముందుకు వెళ్లడం ఉత్తమం. దీనివల్ల మీ జీవితమే కాదు మీ ఇంట్లోని వారి జీవితం కూడా నరకప్రాయం కాకుండా కాపాడుకోవచ్చు.



# ఉప్పు మాత్రమే కాదు.. ఈ 5 ఆహారాలు కూడా హైబీపీని పెంచేస్తాయి






జీవనశైలి వ్యాధుల్లో హైబీపీ ముఖ్యమైనది. చెడు ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం, ఒత్తిడితో కూడిన జీవితం హైబీపీకి కారణాలు కావచ్చు. ప్రస్తుతం ఎంతోమంది చిన్న వయసులోనే హైబీపీతో ఇబ్బంది పడుతున్నారు. వాస్తవానికి అధిక రక్తపోటు ఇప్పుడు సాధారణ వ్యాధిగా మారింది. కానీ దాని తీవ్రతను తక్కువగా అంచనా వేయలేము. సకాలంలో చికిత్స చేయకపోతే భవిష్యత్తులో గుండెపోటు, మూత్రపిండాల వైఫల్యం, స్ట్రోక్ వచ్చే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. హైబీపీ అనేది జీవనశైలి వ్యాధిగా మారిపోయింది. మీ జీవనశైలిలో కొన్ని మార్పులు చేయడం ద్వారా దీనిని అదుపులో పెట్టుకోవచ్చు. హైబీపీకి కారణమయ్యే ఆహారంగా ఉప్పునే చెప్పుకుంటారు. ఉప్పు తగ్గిస్తే చాలు రక్తపోటు తగ్గుతుందని అనుకుంటారు. నిజానికి ఉప్పు వల్లే కాదు కొన్ని రకాల ఇతర ఆహారాల వల్ల కూడా హైబీపీ పెరిగే అవకాశం ఉంది.

1. ప్రాసెస్ట్ ఆహారాలు

స్థూలకాయం నుంచి హైబీపీ వరకు అన్నింటికీ ప్రాసెస్డ్ ఫుడ్సే కారణం. మీకు ఇష్టమైన ప్యాకేజీ బ్యాండ్ నూడుల్స్, చిప్స్, స్నాక్స్, బిస్కెట్లు, పాస్తా వంటివి తినడంలో అధిక రక్తపోటు పెరుగుతుంది. వాటిలో సోడియం, ట్రాన్స్ ఫ్యాట్స్, ప్రిజర్వేటివ్స్ అధికంగా ఉంటాయి. ఇవి హైబీపీకి నేరుగా కారణమవుతాయి. అటువంటి పరిస్థితిలో, మీకు కూడా హైబీపీ సమస్య ఉంటే, మీరు వీటిని తక్కువగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

2. వేయించిన ఆహారాలు

మీరు అధిక రక్తపోటుతో పోరాడుతుంటే, మీ ఆహారం నుండి ఎక్కువ వేయించిన ఆహారాన్ని తగ్గించండి. పకోడీలు, సమోసాలు, పిజ్జాలు, బర్గర్లు వంటి ఆహారం ఎంత టేస్టీగా ఉన్నా ఆరోగ్యానికి మంచిది కాదు. వీటిలో ట్రాన్స్ ఫ్యాట్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తపోటును పెంచుతుంది. వీటితో పాటు ఉప్పు, పిండి, నూనె, మసాలా







దినుసులు అధిక మోతాదులో ఉండటం వల్ల బీపీని పెంచేస్తాయి.

3. ఊరగాయలు

ఇంట్లో తయారుచేసినా లేదా మార్కెట్లో కన్నా కూడా ఊరగాయలు అతిగా తింటే రక్తపోటును పెంచుతాయి. ఇందులో నూనె, ఉప్పు లేదా వెనిగర్ ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ రక్తపోటును పెంచుతాయి. ముఖ్యంగా రోజూ ఊరగాయలు తింటుంటే బీపీ మేనేజ్మెంట్ లో కష్టంగా మారుతుంది.

4. అప్పడాలు

ప్రతి ఇంట్లో అప్పడాలు, వడియాలు ఉంటాయి. వాటిలో కూడా సోడియం స్థాయిలు చాలా ఎక్కువగా ఉంటాయి. అప్పడాలు అధికంగా తింటే క్రమంగా బీపీ పెరగడానికి కూడా కారణమవుతుంది.

5. పంచదార

ఉప్పు తినడం వల్లే రక్తపోటు పెరుగుతుందని ఎక్కువగా భావిస్తారు. అయితే షుగర్ ఎక్కువగా తినడం వల్ల కూడా బీపీ పెరగడానికి కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. చాక్లెట్, స్వీట్లు లేదా మరే ఇతర బేకరీ వస్తువు వంటి తీపి పదార్థాలు ఎక్కువగా తిన్నప్పుడు, ఇన్సులిన్ స్థాయి వేగంగా పెరుగుతుంది. దీనివల్ల సిరలు బిగుసుకుపోయి బీపీ పెరగడం మొదలవుతుంది. స్వీట్లు ఎక్కువగా తింటే హైబీపీ వచ్చే అవకాశాలు రెట్టింపు అవుతాయని నిపుణులు చెబుతున్నారు.



# ‘పొలిమేర 3’లో అర్జున్



ఇటీవలే ‘బ్లాస్ట్’ సినిమాతో విజయాన్ని అందుకున్నారు నటుడు అర్జున్. ఇప్పుడాయన ‘పొలిమేర 3’లో ప్రధాన పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ‘మా ఊరి పొలిమేర’, ‘పొలిమేర 2’ విజయాల తర్వాత ఈ ఫ్రాంచైజీలో అనిల్ విశ్వనాథ్ తెరకెక్కిస్తున్న మూడో చిత్రమిది. వంశీ నందిపాటి, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సత్యం రాజేశ్, కామాక్షి భాస్కర్ల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. శనివారం అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలోని తన పాత్రని రివీల్ చేశారు. ఆయనిందులో విరావి అనే శక్తిమంతమైన పాత్రలో అలరించనున్నట్లు పోస్టర్‌తో స్పష్టత ఇచ్చారు.

# ఎంత ద్వేషిస్తే అంతగా ప్రేమిస్తా!



ఇటీవల జరిగిన బోనాల వేడుకలో కథానాయిక ఫరియా అబ్దుల్లా సందడి చేసింది. అమ్మవారికి బంగారు బోనం సమర్పించడంతో పాటు పోతరాజుతో కలిసి ఆమె హుషారుగా నృత్యాలు చేసింది. ఈ వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. మత విశ్వాసం వేరైనా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై ఆమెకున్న గౌరవం పట్ల సోషల్‌మీడియా వేదికగా ప్రశంసలు వెల్లువెత్తాయి. అదే సమయంలో కొందరు ఉద్దేశ్యపూర్వకంగా విమర్శలు చేస్తూ ట్రోలింగ్‌కు దిగారు. ఈ పరిణామాలపై స్పందిస్తూ శనివారం ఫరియాఅబ్దుల్లా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ వీడియోను పోస్ట్ చేసింది.

తన తండ్రి సంజయ్ అబ్దుల్లా జన్మతః హిందువని, తర్వాత ఆయన ఇస్లాంలోకి మారారని చెప్పింది. ‘నేను మతంలో ఎప్పడూ మంచి విషయాలనే చూశాను. నన్ను ద్వేషించేవారు, నాకు మతవిశ్వాసాలు లేవని భావించేవారు ఏమనుకున్నా సరే..వారందరికి మంచి జరగాలని కోరుకుంటున్నా. నన్ను ఎంత ద్వేషించినా సరే మీకు అంత ప్రేమను పంచుతూనే ఉంటా. నేను చెట్లలో, రాళ్లలో, ప్రతీ జీవిలో దైవత్వాన్ని చూస్తాను. ఇవన్నీ మిమ్మల్ని దేవుడి ప్రేమకు దగ్గర చేయడానికి బదులు దూరం చేస్తున్నట్లయితే మీరు గొప్ప అనుభూతిని కోల్పోతున్నారని చెప్పడానికి బాధపడుతున్నా’ అంటూ వీడియోలో భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీటిపర్యంతమయింది ఫరియా అబ్దుల్లా.

# సరికొత్త ప్రేమకథ



ఆది సాయికుమార్ కథానాయకుడిగా ఫణికృష్ణ సిరికి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘సైరాబాను’. బాంధవి శ్రీధర్ కథానాయిక. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. విధి, విశ్వాసాలతో ముడిపడిన సరికొత్త ప్రేమకథతో రూపొందుతున్న చిత్రమిదని, భిన్న మతాల, సంస్కృతుల కలయికని ప్రతిబింబిస్తున్న పోస్టర్‌కు తగ్గ కథతోనే రూపొందుతోందని చిత్రవర్గాలు చెప్పాయి.


# ప్రతి ఇంట్లో ఓ కావేరి!



‘తండ్రీకూతుళ్ల తాలూకు బంధం, భావోద్వేగాలు ప్రపంచంలో ఎక్కడైనా ఒకేలా ఉంటాయి. అదే తరహాలో ‘ఇరుముడి’ సినిమా కూడా యూనివర్సల్‌గా ప్రతీ ఒక్కరికి కనెక్ట్ అవుతుంది’ అని చెప్పింది చిత్ర కథానాయిక ప్రియా భవానీ శంకర్. ఆమె రవితేజతో కలిసి నటించిన ఫ్యామిలీ యాక్షన్ డ్రామా ‘ఇరుముడి’ ఈ నెల 21న విడుదలకానుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. శనివారం కథానాయిక ప్రియా భవానీ శంకర్ విలేకరులతో సినిమా సంగతుల్ని పంచుకుంది.

ఈ సినిమాలో తాను కావేరి అనే గృహిణి పాత్రలో కనిపిస్తానని, ఆమెకు కూతురే ప్రపంచమని చెప్పింది. ‘కూతుళ్లను అమితంగా ప్రేమించే కావేరిలాంటి పాత్రల్ని ప్రతి ఇంట్లో చూస్తుంటాం. ఈ పాత్ర చేయడం నిజంగా నాకో సవాలు. ముఖ్యంగా పల్లెటూరి యాసలో మాట్లాడటం కష్టంగా అనిపించింది. ఈ కథలో గొప్ప సందేశం కూడా ఉంటుంది. పిల్లలకు ఏం జరిగినా ఆ విషయాలను తల్లిదండ్రులతో షేర్ చేసుకునే స్వేచ్ఛను ఇవ్వాలనే అంశం ప్రతీ ఒక్కరిని ఆలోచింపజేస్తుంది’ అని చెప్పింది.

# దసరా సీజన్‌లో కామ్రేడ్



శ్రీవిష్ణు కథానాయకుడిగా నటిస్తున్న ‘కామ్రేడ్ కళ్యాణ్’ దసరా సీజన్‌ని పురస్కరించుకుని అక్టోబరు 10న విడుదల కానుంది. ఆ విషయాన్ని చిత్రబృందం ఓ ప్రత్యేకమైన పోస్టర్‌ని విడుదల చేస్తూ శనివారం ప్రకటించింది. ఆంధ్ర - ఒడిశా సరిహద్దు ప్రాంతం, 1992 నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. మహిమా నంబియార్ కథానాయిక. జానకిరామ్ మారెళ్ల దర్శకుడు. వెంకటకృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. యాక్షన్, వినోదం, భావోద్వేగాల్ని మేళవిస్తూ రూపొందిస్తున్న చిత్రమిదని, కామ్రేడ్ కళ్యాణ్‌గా శ్రీవిష్ణు చేయనున్న సందడి అందరికీ నచ్చేలా ఉంటుందని సినీవర్గాలు చెప్పాయి. రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లియామే, సత్య, అవినాష్ తదితరులు నటిస్తున్నారు.

# ఆంధ్ర క్రికెట్లోనూ అడుగు




తెలంగాణలో ఈ ఏడాదే మొదలైన టీజీ20 లీగ్‌లో అత్యధిక బిడ్‌తో హైదరాబాద్ ఫ్రాంచైజీని దక్కించుకున్న రామోజీ గ్రూపు సంస్థ ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్.. ఇప్పుడు ఆంధ్ర క్రికెట్లోకి అడుగు పెట్టింది. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) నిర్వహించబోయే మహిళల ఆంధ్ర ప్రిమియర్ లీగ్‌లో అత్యధికంగా రూ.89 లక్షల బిడ్‌తో సెంట్రల్ జోన్ జట్టును ఉషోదయ సొంతం చేసుకుంది. లీగ్‌లో మరో మూడు జట్లుండగా వాటిని గ్యారిసన్ కన్‌స్ట్రక్షన్స్ రూ.85.59 లక్షలు, ఓరా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.77.77 లక్షలు, ఎన్ఎస్ఆర్ ఇండస్ట్రీస్ రూ.61.11 లక్షలతో దక్కించుకున్నాయి. బిడ్డింగ్‌తో పాటు లీగ్ వివరాలను విజయవాడలోని ఏసీఏ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), కోశాధికారి దండమూడి శ్రీనివాస్, డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ కల్యాణ్‌కృష్ణ, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ సారథి మిథాలీరాజ్ శనివారం విలేకరులతో పంచుకున్నారు. మంగళగిరిలోని ఏసీఏ క్రికెట్ స్టేడియంలో సెప్టెంబర్ 15 నుంచి 26 వరకూ లీగ్ నిర్వహించనున్నట్లు శివనాథ్ తెలిపారు. బిడ్డింగ్‌లో 11 సంస్థలు పాల్గొన్నాయని.. కనీస బిడ్ రూ.35 లక్షలని ఆయన వెల్లడించారు. టీజీ20 లీగ్ తొలి సీజన్లో ఉషోదయ జట్టు హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

మూలపాడు స్టేడియంలో ‘సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్’: వచ్చే జనవరికి మూలపాడులో క్రికెట్ ‘సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్’ను ప్రారంభిస్తామని, ఈ కార్యక్రమానికి ఐసీసీ ఛైర్మన్ జైషాతో పాటు క్రికెట్ పెద్దల్ని ఆహ్వానిస్తామని శివనాథ్ తెలిపారు. మహిళల ప్రిమియర్ లీగ్‌కు మిథాలి రాజ్ నేతృత్వం వహిస్తారని.. ఏడాదిగా ఆమె ఏసీఏ తరపున కోచ్‌గా, మెంటార్‌గా సేవలందిస్తున్నారని.. పురుషుల కోచ్‌గా గ్యారీని నియమించామని ఆయన చెప్పారు. డబ్ల్యూఏపీఎల్ మ్యాచ్‌లు చూసేందుకు విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు శివనాథ్ వెల్లడించారు. డబ్ల్యూఏపీఎల్ కోసం 200 మందికి పైగా మహిళా క్రికెటర్లు నమోదు చేసుకున్నారని, భవిష్యత్తులో ఈ లీగ్.. బీసీసీఐ నిర్వహించే డబ్ల్యూపీఎల్ స్థాయికి ఎదుగుతుందని మిథాలీరాజ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

స్పోర్ట్స్ న్యూస్





# జిమ్ ఫిట్‌నెస్ కాదు.. మ్యాచ్ కోసం ఫిట్‌గా ఉండాలి: గావస్కర్

జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా.. ఇదీ గాయాలతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ బాట పట్టిన భారత క్రికెటర్లు. ఇంజూరీ మేనేజ్‌మెంట్‌పై తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, సీవోఈపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిజియోలు ఇలా వార్తల్లో నిలవడం బాధాకరమని తెలిపారు. అలాగే ప్లేయర్ల ట్రైనింగ్ రొటీన్‌ను మార్చాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

“జస్‌ప్రీత్ బుమ్రాకి మోకాలి గాయం ఉంది. మిగతా ప్లేయర్లలో చాలా మందిలో కండరాలు పట్టేయడం చూస్తున్నాం. వారికి ఇస్తున్న ట్రైనింగ్‌లో ఏదో పొరపాటు ఉందనిపిస్తోంది. అందుకే పదేపదే గాయాలు తిరగబెడుతున్నాయి. భారత్ జట్టుకు ఆడుతున్నప్పుడే గాయపడుతున్నారు. దురదృష్టవశాత్తూ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ఫిజియోలను బ్లేమ్ చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. మరీ ముఖ్యంగా బయోమెకానిక్స్ పేరుతో నెట్స్‌లో బౌలర్లను పరిమిత సంఖ్యలోనే బంతులు వేయాలనే విధానం సందేహాస్పదంగా మారింది. ఐపీఎల్‌లోనూ కొందరు విదేశీ ఫిజియోలు నెట్స్‌లో 20 బంతులు కంటే ఎక్కువ వేయనివ్వకుండా చూస్తారని తెలిసింది. టీ20ల్లో బౌలర్ కనీసం 24 బంతులు విసరాలి. కానీ, నెట్స్‌లో అంతకంటే తక్కువ బంతులు ప్రాక్టీస్ చేయడం వల్ల ఏం ప్రయోజనం?” అని గావస్కర్ ప్రశ్నించారు.

ఎందుకంత?

“గాయాలు ఎందుకు పునరావృతం అవుతున్నాయనేది తెలుసుకోవాలి. అందుకు పరిష్కారం కనుగొనాలి. జిమ్ ఫిట్‌నెస్ కంటే మ్యాచ్ ఫిట్‌నెస్ ముఖ్యం. అయితే, నేను ఫిట్‌నెస్ విషయంలో భిన్నమైన అభిప్రాయాలున్న తరానికి చెందినవాడిని కావచ్చు కానీ.. మ్యాచ్ ముఖ్యమని భావిస్తా” అని సునీల్ గావస్కర్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఆటగాళ్ల గాయాలపై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫిజియోల నుంచి బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వివరణ అడిగారు.



# వేడి దెబ్బకు వాంతులు.. సిన్సినాటి ఓపెన్‌లో జకోవిచ్‌కు షాక్

టెన్నిస్ స్టార్ ఆటగాడు జకోవిచ్‌కు సిన్సినాటి ఓపెన్‌లో షాక్ తగిలింది. రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. తొలి సెట్‌లో గెలిచిన జకోవిచ్.. ఆ తర్వాత రెండు సెట్లను కోల్పోయి ఓటమిని చవిచూశాడు. అర్జెంటీనా ఆటగాడు థియాగో టిరంటే 2-6, 6-4, 6-4 తేడాతో జకోవిచ్‌పై విజయం సాధించాడు. గత వింబుల్డన్ తర్వాత 39 ఏళ్ల జకోవిచ్ తలపడిన మొదటి టోర్నీ ఇదే.

ఇబ్బంది పడిన జకో

సిన్సినాటి ఓపెన్‌లో జకోవిచ్ ఓటమి కంటే అభిమానులను ఆందోళనకు గురి చేసే అంశం మరొకటి ఉంది. మరికొద్ది రోజుల్లో యూఎస్ ఓపెన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో జకో ఫిట్‌నెస్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సిన్సినాటి ఓపెన్ సమయంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. అక్కడి వాతావరణం దెబ్బకు వాంతులు కూడా చేసుకోవాల్సి వచ్చిందని టెన్నిస్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం అమెరికాలో వేసవికాలం. దీంతో ఎండలు విపరీతంగా ఉన్నాయి. యూఎస్ ఓపెన్ సమయంలోనూ ఇదే వాతావరణ పరిస్థితులు ఉంటాయి. తీవ్ర పోటీ ఉండే గ్రాండ్‌స్లామ్‌లో విజేతగా నిలవాలంటే మాత్రం జకోవిచ్ తన ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాల్సిందే.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945